# మెట్రో ఈవినింగ్స్

ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

రూ.6/-

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,ఆదివారం,
మే 10, 2026
పేజీలు : 8+4
సంపుటి: 28,సంచిక:288

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

ఆదివారం, తేది:10-05-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,వైశాఖ మాసం,ఉత్తరాయణం-వసంత రుతువు,శుక్ల పక్షం,అష్టమి,ధనిష్ట, వర్జ్యం,తె.3.41ల 5.19


ఇస్లామాబాద్ వేదికగా..

## అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి చర్చలు!

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమాసియాలో సంఘర్షణను ముగించడమే లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. ఓ ఒప్పందానికి సంబంధించి అమెరికా- ఇరాన్ మరోసారి చర్చలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాకిస్థాన్లోని ఇస్లామాబాద్ కు ఇరుదేశాల ప్రతినిధులు వచ్చేవారం రానున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి.సంఘర్షణకు ముగింపు పలకడమే లక్ష్యంగా.. 14 పాయింట్ల అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఆ కథనాలు వెల్లడించాయి.



# 11 నుండి విద్యా వారోత్సవాలు

## కలెక్టర్లతో సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 11 వ తేదీ నుండి నిర్వహించే విద్యా శాఖ వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్లతో సిఎస్ మాట్లాడుతూ, సోమవారం నాడు ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న విద్యావారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు బారి సంఖ్యలో హాజరయ్యేలా కలెక్టర్లు చొర వతీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వారోత్స వాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను, రోజువారీ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్లకు విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించారు. అంతకుముందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధించిన పురోగతి, పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, జనాభా స్వీయ గణనకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సిఎస్ జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రానా,కళాశాల విద్యా శాఖ కమీషనర్ దేవసేన, పాఠశాల విద్య శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.




# సవాళ్లను అధిగమిస్తాం

## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీతో సీఎం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ మొత్తంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం జరిగిన గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆధునీకరణ, నగరీకరణతో సమీప భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించడానికి ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి గారు సమావేశంలో సవివ రంగా ఆవిష్కరించారు. పెరుగు తున్న నగరీకరణ వల్ల సమీప భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉ ంటుందని ముఖ్యమంత్రి చెబుతూ, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

# ప్రతిష్టంభనకు తెర




- తమిళనాడులో కొనసాగుతున్న హైడ్రామాకు ముగింపు
- ఎట్టకేలకు విజయ్ నేడే ప్రమాణస్వీకారం

ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడులో టీవీకే అధినేత నటుడు విజయ్ జోసెఫ్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. గత నాలుగు రోజులుగా అనేక మలుపులు తిరుగుతూ సస్పెన్షన్ థ్రిల్లర్ సినిమాను తలపించిన తమిళ రాజకీయాల్లో చివరకు శుభం కార్డు పడింది. కాంగ్రెస్, వామపలు, వీసీకే, ఐఎంయూఎల్ మద్దతుతో విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్నారు. సర్కారు ఏర్పాటుకు గవర్నర్ ఆర్వే అర్లేకర్ అనుమతి ఇచ్చారు. దీంతో ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విజయ్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ వేడుక కోసం నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి.తొలుత శనివారం సాయంత్రం వీసీకే, ఐఎంయూఎల్ మద్దతు ప్రకటించిన తర్వాత 120 మంది ఎమ్మెల్యేల సంతకాల లేఖను తీసుకుని నాలుగోసారి గవర్నర్ను కలిసేందుకు వెళ్లిన విజయ్కు ఆయన అపాయింట్మెంట్ నిరాకరించారు. కానీ, కాసేటికే మనసు మార్చుకున్న గవర్నర్.. విజయ్కు సమయం ఇచ్చారు. ఈ నేపథ్యంలో గవర్నర్ను కలిసి, ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరారు. అనంతరం సీఎంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రమాణ స్వీకారం చేయడానికి తమ విలువైన సమయం కేటాయించాలని గవర్నర్కు విజయ్ విజ్ఞప్తి చేశారు.

కారులో గ్యాస్ నింపుతుండగా పేలుడు



# 3 వాహనాలు దగ్ధం

కామారెడ్డి,(మెట్రోన్యూస్): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓకారులో గ్యాస్ నింపుతుండగా ఒక్కసారిగా ట్యాంకు పేలింది. ఈ ప్రమాదంలో కారు పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో రెండు కార్లు,ద్విచక్రవాహనం దగ్ధమయ్యాయి. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు.ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

# తెలంగాణకు ప్రధాని

## వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
## సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో బహిరంగ సభ
## ముఖ్యమంత్రి రేవంత్కు ఆహ్వానం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): మూడోసారి దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నరేంద్ర మోదీ తెలంగాణకు మొదటిసారి వస్తున్నారు. బేగంపేట ఎయిర్పోర్టు వేదికగా పలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు వర్చ్యువల్గా చేయనున్నారు. సుమారు రూ.8 వేల కోట్ల రూపాయల మేర అభివృద్ధి పనులను పీఎం జాతికి అంకితం చేస్తారని చుడతారని బీజేపీ రాష్ట్ర పార్టీ ప్రకటించింది. వరంగల్లోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ ప్రారంభోత్సవం, హైదరాబాద్-పనాజీ ఎకానమిక్ కారిడార్లోని గుడెబల్లూర్-మహబూబ్నగర్ నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన, కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ పనులను హైదరాబాద్ హెచ్ఐసీసీ వేదికగా ప్రధానమంత్రి వర్చువల్గా చేపట్టనున్నారు. నినిసాయంత్రం జరిగే సభకు రెండు లక్షల మందితో జనసమీకరణ చేసినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం అందింది.



# రుతుపవనాలు వచ్చేస్తున్నాయి

## తెలుగు రాష్ట్రాల్లో జోరువానలు

ఇంటర్నెట్ డెస్క్: దేశ ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలపై వాతావరణ శాఖ బిగ్ అప్ డేట్ ఇచ్చింది. ఈ ఏడాది రుతు పవనాలు జూన్ 1నే కేరళ తీరాన్ని తాకనున్నాయని అంచనా వేస్తోంది భారత వాతావరణ శాఖ. మే 20 నాటికి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులకు చేరుకుంటాయని తెలిపింది.కొన్ని అంతర్జాతీయ వాతావరణ ఏజెన్సీలు రుతు పవనాలు కాస్త ముందుగానే రావొచ్చని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో కురుస్తున్న వేసవి జల్లులు, ఉరుములు కూడా రుతుపవనాలు సరైన సమయానికే వస్తున్నాయనడానికి సంకేతాలని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ,తమిళనాడులో కురుస్తున్నవి రుతుపవనాలకు ముందు సంభవించే ఉరుములతో కూడిన వర్షాలు మరోవైపు, ఆస్ట్రేలియాలో వర్షాకాలం ముగిసి, వేసవి మొదలవ్వడం భారత ఉపఖండానికి అనుకూలంగా మారింది.



# బండి సంజయ్ను బర్తరఫ్ చేయాలి

## ప్రధాన మంత్రికి కేటీఆర్ సూటి ప్రశ్న

హైదరాబాద్ (మెట్రో న్యూస్): కేంద్రమంత్రి బండి సంజయ్ కొడుకు పైన నమోదైన ఫోక్సో కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బాలిక పరిస్థితి వారి కుటుంబంపైన జరుగుతున్న వేధింపులపై ఆవేదన వ్యక్తం చేసిన ఆయన ప్రధానమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వం పైన పలు ప్రశ్నలు సంధించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై మీరు ఎలాంటి చర్య తీసుకోబోతున్నారు? అతనికి మినహాయింపు ఉంటుందా? బండి సంజయ్ ఎప్పుడు రాజీనామా చేస్తారు లేదా మంత్రివర్గం నుండి ఎప్పుడు బర్తరఫ్ చేయబడతారు? అని ప్రధాన మంత్రిని ప్రశ్నించారు.

# పంటల మార్పిడిపై మంత్రికి రైతు కమిషన్ నివేదిక



**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** రాష్ట్రంలో పంట మార్పిడి అవశ్యకత పై వ్యవసాయశాఖ కమిషన్ రూపొందించిన నివేదికను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి రైతు కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి సభ్యులు సచివాలయంలో శనివారం అందచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు ప్రధానంగా వరి, పత్తి పంటలపై ఆధారపడుతున్న నేపథ్యంలో, ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటల సాగును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ కమిషన్ సమగ్ర నివేదిక రూపొందించింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి సుమారు 1.30 కోట్ల ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని, వచ్చే మూడు సంవత్సరాల్లో అందులో కనీసం 13 లక్షల ఎకరాలను ఉద్యాన పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఆయిల్‌సీడ్స్ సాగుకు మళ్లించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొం దించాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. పంట మార్పిడిలో మార్కెట్ లో డిమాండ్ ఉండే పంటలు సూచిస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం వుంది కనుక అటువంటి పంటలు మరియు దేశ ప్రాంత అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళిక చెయ్యాలని మంత్రి సూచించారు.

అదేవిధంగా ఈ సంవత్సరంలో 45 వేల ఎకరాలలో కొత్తగా ఆయిల్ పామ్ సాగును తీసుకురాగా.. వచ్చే సం వత్సరంలో 1 లక్ష ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేసేలా ప్రణాళిక తయారు చేసి, దానిని సాధించాలని అన్నారు. కేంద్రం తయారుచేసిన విత్తన చట్టంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ చట్టంలో నకిలీ విత్తనాల వలన రైతులు నష్టపోతే, రైతులకు చెల్లించాల్సిన పరిహారం విషయంలో ఎలాంటి స్పష్టత లేదన్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో తెలంగాణ రాష్ట్రానికి 90 శాతం కేటాయించి, సరఫరా చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మీన్ బాషా మరియు మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి మరియు ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సూపర్వైజర్ ట్రైనీ ఎంపిక జాబితా విడుదల



**హైదరాబాద్, (మెట్రోన్యూస్ )** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీ జి ఎస్ ఆర్ టి సి)లో ఖాళీగా ఉన్న 198 ట్రాఫిక్ సూ పర్వైజర్ ట్రైనీ (టి ఎస్ టి), మెకానికల్ సూపర్వైజర్ ట్రైనీ (ఎం ఎస్ టి) పోస్టుల భర్తీకి సంబంధించి ఎంపికైన అభ్యర్థుల వివరాలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టి ఎస్ ఎల్ పి ఆర్ బి) చైర్మన్ శ్రీ వి.వి. శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 25న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన రాత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి, ఏప్రిల్ 16, 17 తేదీల్లో అంబర్‌పేటలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది ఎంపికలు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ పోస్టులకుగాను 62 మంది పురుషులు, 22 మంది మహిళలు ఎంపికయ్యారని, అలాగే 114 మెకానికల్ సూపర్వైజర్ ట్రైనీ పోస్టుల్లో 79 మంది పురుషులు, 33 మంది మహిళలతో కలిపి మొత్తం 112 ఖాళీలను భర్తీ చేసినట్లు వివరించారు. తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడం వల్ల మెకానికల్ విభాగంలో రెండు పోస్టులు భర్తీ కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థుల రిజిస్ట్రేషన్ నంబర్లు, పేర్లు మరియు కట్-ఆఫ్ మార్కుల వివరాలను బోర్డు అధికారిక వెబ్‌సైట్ .. లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు మే 13వ తేదీ ఉదయం 8 గంటల నుండి 16వ తేదీ అర్ధరాత్రి వరకు వెబ్‌సైట్‌లోని తమ లాగిన్ ద్వారా ఆన్‌లైన్ అటెస్టేషన్ ఫారాన్ని పూర్తి చేయాలని చైర్మన్ సూచించారు. డిజిటల్‌గా నింపిన ఈ ఫారాలను మూడు సెట్ల ప్రింటౌట్లు తీసుకుని, అభ్యర్థులు తమ సంతకంతో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ పొందాలని వివరించారు. ధ్రువీకరించిన మూడు సెట్ల అటెస్టేషన్ ఫారాలను, ఇతర ధ్రువపత్రాల నకళ్లతో కలిపి మే 20వ తేదీన తమకు కేటాయించిన ప్రాంతాల్లో నేరుగా అందజేయాల్సి ఉంటుంది. ట్రాఫిక్ సూపర్వైజర్ పోస్టులకు ఎంపికైన జోన్ 1, 2, 3 అభ్యర్థులు రామగుండం డిఐజి కార్యాలయంలో, జోన్ 4, 5 అభ్యర్థులు హనుమకొండలోని డిఐజి కార్యాలయంలో తమ పత్రాలను సమర్పించాలని తెలిపారు. అలాగే మెకానికల్ సూపర్వైజర్ పోస్టులకు ఎంపికైన జోన్ 6, 7 అభ్యర్థులు హైదరాబాద్ అంబర్‌పేటలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థుల క్యారెక్టర్ మరియు యాంటిసిడెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్షల అనంతరం తుది నియామకాలు ఉంటాయని టి ఎస్ ఎల్ పి ఆర్ బి చైర్మన్ శ్రీ వి.వి. శ్రీనివాసరావు ఈ సందర్భంగా వెల్లడించారు.

## జనగణనలో బీసీల కులం మెన్షన్ చెయ్యాలి: వీహెచ్

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** బీసీ జనం పెరుగుతున్నారు... జనగణన ద్వారా మాకు న్యాయం చెయ్యాలని మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారులు వీ హెచ్ హన్మంత్ రావు డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ లకు న్యాయం చేస్తున్నారని బీసీలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారుమోడీకి రెండు లెటర్స్ రాశామని వాటికి జవాబు తక్షణమేఇవ్వాలన్నారు..బీసీలపై నిర్ణయం తీసుకున్న తర్వాతే తెలంగాణకు మోదీ రావాలన్నారు.బీసీ లకు న్యాయం జరగాలని ఉద్యోగాలు రావాలన్నారు.బీసీలలో బీజేపీ ఎంపీ లు చాలా ఉన్నారు. బీసీ అయ్యుండి బిజెపి ఎంపీలు మాకు న్యాయం చెయ్యాలన్నారు.బిజెపి దేశాన్ని ముక్కలు చెయ్యాలనీ, మతపరంగానే వెళ్తున్నారని ఆయన ఆరోపించారు. బీసీలను అంశంపై మోదీ వెంటనే స్పందించాలన్నారు.బీసీ అని చెప్పుకునే మోది బీసీలకు అన్యాయం చేస్తున్నాడన్నారు.బీసీలపై మోదీ స్పందించకుంటే.. నిరాహార దీక్ష తర్వాత బీసీలకు మొండి చెయ్యి చూపిస్తున్న బిజెపిని ఎండగడతానన్నారు.దేశం అంత తిరుగుతనని ఓట్లు మావి వేసుకొని బీసీ లకు అన్యాయం మోదీ చేస్తుండన్నారు.

## ప్రధాని మోడీకి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి

**హైదరాబాద్ (మెట్రో న్యూస్ ):** పాలమూరు-రంగారెడ్డి సాగునీటి పథకానికి జాతీయ హోదా కల్పించడంతో పాటు తెలంగాణ ప్రజల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ప్రధానమంత్రి నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు.ప్రధాని ఆదివారం హైదరాబాద్ విచ్చేస్తున్న సందర్భంగా ఎంపీ రవిచంద్ర శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ నిధులు విడుదల చేయాల్సిందిగా, బయ్యారం ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు ఆమోదం తెల్పాల్సిందిగా, ఖాజీపేటలో రైల్వే మానిఫ్యాక్చరింగ్ యూనిట్ కాకుండా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటునకు పచ్చజెండా ఊపాల్సిందిగా ఎంపీ రవిచంద్ర ప్రధానమంత్రి మోడీని కోరారు. అదేవిధంగా తెలంగాణలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం)నెలకొల్పాలని, గిరిజన యూనివర్సిటీకి మరిన్ని నిధులు విడుదల చేయాలని,మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణపు పనులను మరింత వేగవంతం చేయాలని ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి చేశారు.దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం నిర్మించాలని ఆయన కోరారు. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం)రైల్వేస్టేషన్ ఏర్పాటై 2032 నాటికి 100 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా డివిజన్ ఏర్పర్చాల్సిందిగా ప్రధాని నరేంద్రమోడీకి ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా జవహర్ నవోదయ పాఠశాలలు కేవలం 16 మాత్రమే ఉన్నాయని,జిల్లాకొకటి చొప్పున మరో 17,రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2 సైనిక్ స్కూల్స్ మంజూరు చేయాల్సిందిగా ఆయన కోరారు.ప్రజల కోరిక మేరకు భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాల్సిన అవసరాన్ని తన ప్రకటన ద్వారా ఎంపీ రవిచంద్ర ప్రధాని మోడీ దృష్టికి తెచ్చారు.అలాగే,జనగణన సందర్భంగా కులగణన చేపట్టాలని, చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్స్ కల్పిస్తూ మహిళా రిజర్వేషన్లతో పాటుగా అమలు చేయాల్సిందిగా ప్రధానమంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.ఓబీసీల సంక్షేమం, అభ్యున్నతికి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాల్సిందిగా ఎంపీ వద్దిరాజు ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు.



## 12 నుంచి అదనపు పని వేళలు రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

### - మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చు తగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు.అధిక రద్దీ ఉన్న చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్.ఓ, పటాన్ చెరు, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పని వేళలను ఈ నెల 12వ తేదీ నుంచి పొడిగిస్తున్నట్లు వెల్లడిం చారు. ఈ 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో అవసర మైతే మరింత సమయాన్ని పెంచడానికి ప్రభుత్వం సిద్ధం గా ఉందని తెలిపారు. అదేవిధంగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్లాట్ బుకింగుల సంఖ్యను కూడా పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



## హైదరాబాద్ క్రైమ్ హబ్‌గా మారింది పట్టపగలే హత్యలపై మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సబితా ఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని... హైదరాబాద్ క్రైమ్ హబ్‌గా మారిందని అన్నారు. మాజీ ఐపీఎస్ భార్యను హత్య చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ అర్ధరాత్రి గస్తీకి వెళ్తే పోకిరీలు ఎలా వేధించారో అందరికి తెలుసు. తెలంగాణలో క్రైమ్ రేట్ పెరిగిందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ చెప్తున్నాయి. రాష్ట్రంలో 18.4 శాతం క్రైమ్ రేట్ పెరిగింది. మహిళలు, చిన్నారులపై దాడుల్లో తెలంగాణ... దక్షిణ భారత దేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు శాంతి భద్రతలు పటిష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. శాంతి భద్రతలను విస్మరిస్తే రాష్ట్రం వెనక్కి పోతుందన్నారు. శనివారం తెలంగాణ భవన్లో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతిపక్షాలపై వేధింపులు తప్ప ప్రభుత్వం శాంతిభద్రలపై దృష్టి పెట్టడం లేదన్నారు. హోం మంత్రి బాధ్యతలను సీఎం పూర్తిగా విస్మరించారని తెలిపారు. కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి ఉన్న కరీంనగర్‌లో పట్ట పగలు గోల్డ్ షాప్‌లో చోరీ జరిగింది. నివేదికలు తెప్పించుకునే తీరిక సీఎంకు,కేంద్ర హోం శాఖా సహాయ మంత్రికి లేదు. రెండు ఏళ్ల నుంచి ప్రతిపక్ష ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలపై దాడులు చేస్తున్నారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణచేసిచర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రశ్నిస్తూనే ఉంటా... జైలు నుంచి విడుదలైన బీఆర్ఎస్ నేత క్రిశాంక్

**సంగారెడ్డి (మెట్రో న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్ కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుంచి శనివారం ఉదయం విడుదల అయ్యారు. బ్యాక్ టూ క్వశ్చన్ అనే టీ షర్ట్ వేసుకొని ఆయన బయటకు వచ్చారు. తనతో వెన్నంటి ఉన్న పార్టీకి, నిరంతరం న్యాయ పోరాటం చేసిన పార్టీ లీగల్ టీంకు క్రిశాంక్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తున్నందుకే తనపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారని ఆరోపించారు. అయితే ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. అంగన్వాడీలకు మొబైల్ ఫోన్లపై అవినీతి జరిగిందని ప్రశ్నించాను. రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ అవినీతిపై పోరాటం చేశానని తెలిపారు. అందుకే తనను 16 రోజులు జైలులో పెట్టారని... అయినప్పటికీ వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. అవినీతి అక్రమాలు బయట పెట్టిన మామీద కాదు కేసు పెట్టుడు కాదు... రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతల పై మీరు ఫోకస్ చేయాలని సూచించారు. సీపీ సుమతికి అర్ధరాత్రిరక్షణలేకుండా పోయింది... ఐ.ఎ.ఎస్, ఐ.పీ.ఎస్. క్వార్టర్స్‌లోనే రక్షణ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఫోన్లు ట్యాపింగ్, వైఫై హ్యాకింగ్ చేస్తుందన్న అనుమానం కలుగుతుందని క్రిశాంక్ అన్నారు.




# నిత్య జీవితంలో లింగ వివక్షను వీడాలి

### - మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' ప్యానెల్ చర్చసమాజంలో మార్పు రావాలన్న వక్తలు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): సమాజంలో మహిళల పట్ల ప్రదర్శిస్తున్న చిన్నచూపు, నిత్యం ఎదురయ్యే లింగ వివక్ష వారి మానసిక భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఉన్న వీహబ్ వేదికగా స్టాండ్ విత్ హర్ ప్రచారంలో భాగంగా ఎవ్రీడే సెక్సిజం ,ఎమోషనల్ సేఫ్టీ'అనే అంశంపై శనివారం నాడు ప్యానెల్ చర్చ నిర్వహించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మహిళల పట్ల సమాజం ప్రదర్శిస్తున్న వివక్షా పూరిత ధోరణులపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా చారు సిన్హా మాట్లాడుతూ నిత్యం మహిళలపై జరిగే చిన్నపాటి ఎగతాళి, అసభ్యకరమైన జోకులు నేరాల్లా అనిపించకపోవడమే అసలైన ప్రమాదమని హెచ్చరించారు. ఇవి సమాజంలో ఒక అలవాటుగా మారిపోవడం వల్ల ఎవరూ ప్రశ్నించడం లేదని, ఫలితంగా మహిళలు తమకు రక్షణ ఉండాల్సిన చోట కూడా అభద్రతా భావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకున్నప్పుడే మహిళలకు గౌరవప్రదమైన వాతావరణం లభిస్తుందని ఆమె స్పష్టం చేశారు.




కార్పొరేట్ రంగం నుంచి హాజరైన శైలజ జోశ్యుల మాట్లాడుతూ.. మహిళల ఎంపికలను గౌరవించడం నేర్చుకోవాలని, పాతకాలపు మూసధోరణులకు స్వస్తి పలికినప్పుడే మార్పు సాధ్యమవుతుందన్నారు. అనంతరం సినీ దర్శకుడు శైలేష్ కొలను మాట్లాడుతూ.. మహిళా పాత్రలను సృజించేటప్పుడు తాను ఇప్పటికీ ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తానని, మనమంతా నేర్చుకునే దశలో ఉన్నామని గుర్తించినప్పుడే సమాజంలో మెరుగైన మార్పును చూడగలమని పేర్కొన్నారు. మహిళలు తమకున్న అంతర్గత శక్తిని గుర్తించాలని చాయ్ బిస్కట్ వ్యవస్థాపకుడు శరత్ చంద్ర కోరారు. ఆర్థిక స్వావలంబన సాధించిన మహిళలు జీవితంలో మెరుగైన నిర్ణయాలు తీసుకోగలరని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మసూద్ హుస్సేనీ వివరించారు.ప్రముఖ జర్నలిస్ట్ ప్రేమ మాలిని సమన్వయకర్తగా వ్యవహరించారు. ఏడాది పొడవునా సాగే ఈ 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం ద్వారా ప్రతి నెలా ఒక సామాజిక అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ వివరాలను ఇన్‌స్టాగ్రామ్‌లోని ఉమెనసేఫ్టీయింగ్ టీజీ ఖాతా ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు.

## గవర్నర్ శుక్లాకు రూ.4 లక్షల చెక్కును అందించిన హీరో కృష్ణసాయి

### - రెడ్ క్రాస్ సొసైటీకి మద్దతుగా విరాళం

**హైదరాబాద్ (మెట్రో న్యూస్):** టాలీవుడ్ హీరో కృష్ణసాయి తన సేవా కార్యక్రమాలతో మరోసారి ప్రశంసలు అందుకున్నారు. 'కృష్ణసాయి ఇంటర్నేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా సమాజ సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలకు మద్దతుగా తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాకు రూ.4 లక్షల చెక్కును విరాళంగా అందించారు. హైద రాబాద్ లోని లోక్ భవన్లో జరిగిన ఈ కార్యక్రమంలో యువతకు ఆదర్శంగా నిలుస్తూ సేవాభావంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణసాయిని గవ ర్నర్ ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో పలు అం శాలపై వీరిద్దరు చర్చించుకున్నారు.కృష్ణసాయి తన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, వైద్య సహాయం, అవసరా ర్థులకు నిత్యావసరాల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా యువతను మాదకద్రవ్యాల బారిన పడ కుండా చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తూ యువతలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నారని గవర్నర్ ప్రశంసించారు.



మెట్రో ఈవినింగ్స్

హైదరాబాద్,
ఆదివారం,
మే 10, 2026



# పీసీసీ చీఫ్‌గా పొన్నం?



## మంత్రివర్గంలోకి మహేష్ కుమార్ గౌడ్!

## రేవంత్ మార్క్ ఎలక్షన్ కేబినెట్-2



(భూంపల్లి రాజమౌళి చారి)

హైదరాబాద్ (మెట్రోన్యూస్): పదేళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీదే అధికారం అని ఘంటాపథంగా చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్టుగా చర్యలు చేపడుతున్నారు. ఇటు ప్రభుత్వం, అటు పార్టీ పటిష్టంగా ఉంటేనే... రాబోయే ఎన్నికల్లో పార్టీకి ఎదురు ఉండదని భావిస్తున్న ముఖ్యమంత్రి... సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకునేందుకు వెనుకాడటం లేదు. అసంతుష్టులు... ఆశావహులు... మంత్రుల పనితీరు... సామాజిక సమతుల్యత... అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ ఎలక్షన్ కేబినెట్‌ను సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగానే... పీసీసీ కొత్త చీఫ్‌గా బలమైన బీసీ వర్గం నేత, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నియమిస్తారని జోరుగా చర్చ నడుస్తోంది. మరోవైపు ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కేబినెట్‌లోకి రావడం దాదాపు ఖాయమైపోయిందనే చర్చా సాగుతోంది. తెలంగాణ ఉద్యమంలో పొన్నం ప్రభాకర్ పోరాటపటిమ అందరికి సుపరిచితమే. లోకసభలో ప్రత్యేక రాష్ట్రం కోసం గళం విప్పిన నాయకుడు ఆయన. ఆంధ్ర ఎంపీల పెప్పర్ (స్ప్రేను లెక్కచేయకుండా... హౌస్‌లో తెలంగాణ కావాలని నినదించారు. నిజానికి గత ఏడాది కాలంగా... పొన్నంను పార్టీ పదవుల్లో నియమించాలని ఏఐసీసీ ఆసక్తిగా ఉందన్న వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే... పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఎన్నికల సమయంలో అదిష్ఠానం ఆయనకు హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన అనుచరులు గుర్తుచేస్తున్నారు. ఇది ఒకరకంగా వారిద్దరి పనితీరుకు గుర్తింపు మరియు ప్రమోషన్ లాంటిదే! పొన్నం ప్రభాకర్ విద్యార్థి నాయకుడుగా కాంగ్రెస్‌లో ప్రస్థానం ప్రారంభించి... అంచెలంచెలుగా ఎదిగారు. తెలుగుదేశం, టీఆర్ఎస్ హవాలోనూ ఆయన పార్టీ జెండాను వీడలేదు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేయడం కూడా ఆయనకు కలిసొచ్చే అంశం. ఇక మహేష్ గౌడ్ కేబినెట్‌లోకి రావడం వల్ల... ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం పూర్తి అవుతుంది. పార్టీ కూడా ఆ మేరకు బలోపేతమవుతుందనేది కాంగ్రెస్ పెద్దల లెక్క అవసరమైతే ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవినీ కట్టబెట్టవచ్చని ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డితో మహేష్ గౌడ్‌కు అత్యంత సాన్నిహిత్యం ఉండటమూ ఒక కారణం కావచ్చు.

(ఆర్థిక మంత్రిగా శ్రీధర్‌బాబు? రేపటి సంచికలో)

## హనీ ట్రాప్ కేసులో బండి సంజయ్ కుమారుడు

### రూ.5 కోట్ల కోసం బ్లాక్‌మెయిల్?



హైదరాబాద్ (మెట్రోన్యూస్): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వివాదంలో చిక్కుకున్నారు తనను ఓ అమ్మాయి కుటుంబం హనీట్రాప్ చేసి రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని భగీరథ్ కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంపల్లికి చెందిన ఒక కుటుంబం తన వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తోందని ఆయన ఆరోపించారు. అయితే.. సదరు యువతి మైనర్ అని పేర్కొంటూ ఆమె కుటుంబం కూడా భగీరథ్‌పై హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసింది. పరస్పర ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు పోక్సోగా మారే అవకాశం కనిపిస్తోంది. నిజానిజాల నిగ్గు తేల్చేందుకు పోలీసులు విచారణ ముమ్మరం చేశారు.

రూ. 5 కోట్ల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని భగీరథ్ ఫిర్యాదు

రిటర్న్ కేసు పెట్టిన అమ్మాయి కుటుంబీకులు

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వివాదంలో చిక్కుకున్నారు.

## ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ భారీ ఊరట

ఇంటర్నెట్ డెస్క్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి భారీ ఊరట లభించింది. కీలక కార్యక్రమాల సమీక్షలను పూర్తి చేసిన అనంతరం సుమారు 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 12,275 కోట్లు) నిధులను విడుదల చేసేందుకు ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం తెలిపింది.

ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కింద మూడో సమీక్ష, రెసిలెన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీ (ఆర్ఎస్ఎఫ్) కింద రెండో సమీక్షలను పూర్తి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా తక్షణమే ఈఎఫ్ఎఫ్ కింద 1.1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద 220 మిలియన్ డాలర్లు పాకిస్థాన్‌కు అందనున్నాయి.



## దీక్ష చేపట్టిన వీహెచ్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపడుతున్న జనగణనలో ఓబీసీలను కూడా లెక్కించాలి అనే డిమాండ్‌తో ప్రభుత్వ సలహాదారు,ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు తన అంబర్ పేట నివాసంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. రాజకీయ పార్టీలకి అతీతంగా బీసీల అభ్యున్నతికి, బీసీ జనాభా ప్రతిపాదికంగా న్యాయం జరగాలంటే జనగణనలో బీసీ జనాభా కూడా లెక్కించాలన్న డిమాండ్ తో ఆయన పలు మార్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖలు రాసారు. లేఖలకు సరైన స్పందన లేకపోవడంతో ఆయన ఈ దీక్ష చేపట్టారు

## బెంగాల్ గడ్డపై తొలి భాజపా సర్కార్

**అట్టహాసంగా జరిగిన సువేందుఅధికారి ప్రమాణస్వీకారం**

**హాజరైన మోదీ, అమిత్ షా, చంద్రబాబు తదితర నేతలు**

**సువేందు కేబినెట్ మంత్రులుగా పలువురి ప్రమాణస్వీకారం**



ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ నిరీక్షణకు ఈరోజు తెరపడింది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి ఒకప్పుడు అత్యంత సన్నిహితుడిగా, ఆమె రాజకీయ వ్యూహాల్లో కీలక పాత్ర పోషించిన సువేందు అధికారి... ఈరోజు అదే బెంగాల్ గడ్డపై ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కమ్యూనిస్టుల కోటను బద్దలు కొట్టిన మమత దగ్గరే రాజకీయ ఓనమాలు నేర్చుకుని, చివరకు ఆమెనే ఓడించి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం ఒక పక్కా పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది.సువేందు అధికారి ప్రస్థానం నిజంగానే అద్భుతమని చెప్పొచ్చు. నందిగ్రామ్, భవానీపూర్ ఉద్యమాల్లో మమతకు వెన్నెముకగా నిలిచిన ఆయన, నేడు ఆమె కూర్చున్న కుర్చీలోనే ముఖ్యమంత్రిగా ఆసీనులయ్యారు. బెంగాల్ ఓటర్లు ఆయనకు పట్టం కట్టడం ద్వారా రాష్ట్రంలో ఒక కొత్త శకానికి నాంది పలికారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు పలువుకు అగ్ర నేతలు స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.




## కరీంనగర్‌లో బీఆర్ఎస్ బంద్

### ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హౌస్ అరెస్ట్

కరీంనగర్ (మెట్రో న్యూస్):బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు శనివారం కరీంనగర్‌లో బంద్ ప్రశాంతంగా జరిగింది. మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి, హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారు ధ్వంసానికి నిరసనగా గులాబీ పార్టీ కరీంనగర్ బంద్‌కు పిలుపునిచ్చింది. నగరంలో రోజురోజుకీ దిగజారుతున్న శాంతిభద్రతల పరిస్థితికి నిరసనగా నిర్వహించిన కరీంనగర్ బంద్ ప్రజల పూర్తి మద్దతుతో విజయవంతమైందని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అన్నారు. అయితే బంద్‌ను అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులను వినియోగించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేయించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌ను ఇంటి వద్దే అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనన్నారు. శాంతిభద్రతలను కాపాడడంలో పూర్తిగా విఫలమైన కరీంనగర్ సీపీని వెంటనే సస్పెండ్ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన టూ టౌన్ సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## 'తుమ్మిడిహట్టి పేరుతో కాంగ్రెస్ డ్రామాలు'

సిద్దిపేట (మెట్రో న్యూస్): తుమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, బీఆర్ఎస్‌పై చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. శనివారం నాడు సిద్దిపేట లోని క్యాంపు కార్యాల యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయకుండా రాష్ట్ర ప్రయోజనాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. వచ్చే ఏడాది రాబోయే కరువును ఎదుర్కో వాలంటే మేడిగడ్డ రిపేర్లు వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద కాంగ్రెస్ మంత్రుల పర్యటనపై స్పందిస్తూ... పని తక్కువ ప్రచారం ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు వాగుడు తప్ప చేతలు శూన్యం అని కామెంట్ చేశారు.

## ట్రాఫిక్ కష్టాలకు చెక్

### మూడంచెల విధానంపై సీఎం సమీక్ష




హైదరాబాద్ (మెట్రో న్యూస్): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.శనివారం సచివాల యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్ పర్సన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకు రావాలని నిర్ణయించుకున్నాం అని వివరించారు. నినిట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదు మల్టీ ట్రాన్స్పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్థాయి సంఘం దృష్టికి తీసుకెళ్లారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమిం చేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. రా(ష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం.

తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్ ఆవిష్కరించుకున్నాం. మూసీ రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానించబోతున్నాం. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నాం. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నాం అని వెల్లడించారు.

## //ఎడిటోరియల్//

# మమత పెంచిన సువేందు- ఓడించి మరీ గద్దెనెక్కి !


మమతా బెనర్జీ విప్లవ వనిత. ఆమె చిన్న నాటి నుంచి దూకుడుగానే ఉండేవారు. ఆమె రాజకీయ జీవితం 1976లో కాంగ్రెస్ తో మొదలైంది. 21 ఏళ్ళ వయసులోనే బెంగాల్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పదవిని చేపట్టారు. ఇక 29 ఏళ్ళ వయసులో జాదవ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి సీపీఎం యోధుడు అప్పటికి రెండు సార్లు గెలిచిన దిగ్గజ నేత సోమనాథ్ చటర్జీని ఓడించారు. అలా ఆమె పిన్న వయసులోనే తన పేరు మారు మోగేలా చేసుకున్నారు. దేనికైనా వెరవని తత్వం మొండిగా ముందుకు సాగే నైజం మమత సొంతం. ఇక మమత 1997 దాకా కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. 1998లో ఆమె తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ప్రారంభించారు. ాశ్రీంశీ =ఘుఽ – డీఎంకే విషయం కాంగ్రెస్ తప్పు చేసిందా? శిష్యుడుగా మొదలై : ఇక పశ్చిమ బెంగాల్ కి కొత్త ముఖ్యమంత్రి కాబోతున్న సువేందు అధికారి 1995లో తొలిసారి కాంగ్రెస్ తరఫున కాంటాయ్ మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఆయనది కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి మొదలైన రాజకీయమే. 1998 నాటికి ఆయన మమతా బెనర్జీతో కలిసి తృణమూల్ కాంగ్రెస్ స్థాపనలో పాలు పంచుకున్నారు. 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కంతి దక్షిణ్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఆయన ఎమ్మెల్యేగా తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఇక సువెందు అధికారి తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో మమతా బెనర్జీ కీలక అనుచరుడిగా ఎదిగారు. నందిగ్రాం లో ఎకనమిక్ సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడిన రైతులకు అండగా పోరాడిన నాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన తరువాత రెండు సార్లు ఎంపీ అయ్యారు. ఇక 2016లో తృణమూల్ కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేగా పోటీ చేసి మంత్రిగా వివిధ హోదాల్లో పనిచేశారు. మమతకు ఎంతో దగ్గరి వారిగా పేరు తెచ్చుకున్నారు. మమతకు సువేందు అధికారి అంటే ఎంతో నమ్మకం. తృణమూల్ కాంగ్రెస్ లో ఆయన నంబర్ టూ స్థానంలో ఉండేవారు. అయితే తృణమూల్ కాంగ్రెస్‌లో మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ రంగ ప్రవేశంతో సువేందుకు మమతకు మధ్యన బిగ్ గ్యాప్ ఏర్పడింది. 2011లో మమత తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తరువాత అభిషేక్ బెనర్జీ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఆయన తృణమూల్ స్టూడెంట్ కాంగ్రెస్ విభాగానికి అధ్యక్షుడిగా తన కార్యకలాపాలు ప్రారంభించారు. 2014 లో తొలిసారి అభిషేక్ బెనర్జీ దక్షిణ 24 పరగణాల జిల్లా, డైమండ్ హార్బర్ నియోజకవర్గం నుండి లోక్ సభకు పోటీ చేసి గెలిచారు. ఆ తరువాత 2019, 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అదే సీటు నుంచి గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. ఆయన రాకతో సువేందు అధికారి ప్రాధాన్యత పార్టీలో గణనీయంగా తగ్గడం మొదలైంది. ఈ నేపథ్యంలో తీవ్ర అసంతృప్తితో సువేందు అధికారి తృణమూల్ కాంగ్రెస్ కి 2020 డిసెంబరు 17న రాజీనామా చేశారు. ఆ వెంటనే డిసెంబర్ 19న కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు ఇక ఆయన 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి మమతా బెనర్జీపై 1,736 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారు. మూడు సీట్లు ఉన్న బీజేపీని ఏకంగా 78 సీట్లు అందించి పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో నిలబెట్టారు. దాంతో ఆయనను తరువాత బీజేపీ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమించారు. 2026 ఎన్నికల్లో అయితే ఏకంగా 206 సీట్లు బీజేపీకి దక్కేలా చేయడంలో ఆయనది అత్యంత కీలకమైన పాత్ర. దాంతో ఆయనకే ఈ రోజున బీజేపీ ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించింది. మొత్తానికి చూస్తే మమత పెంచి పోషించిన సువేందు అధికారి ఆమె మీదనే రెండు సార్లు పోటీ చేసి ఎమ్మెల్యేగా ఓడించారు, మాజీ ముఖ్యమంత్రిని చేశారు. తన జీవిత కాలం కల అయిన సీఎం పోస్టు దక్కించుకుని ఈ నెల 9న బెంగాల్ కి 9వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. రాజకీయాల్లో ఇలాంటి ట్విస్టులే ఉంటాయి మరి.

## సమయం:సజీవ సాక్ష్యం

మెట్రో డైలీ

సమయం నిశ్శబ్దంగా..
నిలకడగా ప్రవహిస్తుంది
గడియారమే టిక్ టిక్ అంటూ..
తెగ పొగరుగా అరుస్తుంది !
సమయానికి పక్షపాతం లేదు
సమయం చేతిలో చేయివేసి..
లక్ష్యం వైపు ఏకాగ్రతతో నడిస్తే..
విజయతీరాలకు చేర్చుతుంది !
సమయంలో మన ప్రాణ మిత్రుడు
మనకు ఏం, ఎప్పుడు, ఎక్కడ
ఎం ఇవ్వాలో తెలివిగా తెలుసుకొని..
మన జీవిత పల్లెంలో వడ్డిస్తుంది
!నినిసమయానికి విలువనిస్తే..
మహోన్నత శిఖరాలకు చేర్చుతుంది
సమయాన్ని చులకన చేస్తే..నిఅధ
పాతాళానికి తోసేస్తుంది !
జీవితాన్ని ఆస్వాదిస్తే వేగంగా..
కష్టనష్టాల బాధల్లో నెమ్మదిగా..
ఎదురు చూపుల్లో మందకోడిగా..
శుభ కార్యాల్లో జోరుగా వడివడిగా..
కదిలినట్లు అనిపించే సమయం
నరులతో ఆడుతుంది వింత నాటకం
మన రాకపోకలకు అదో సజీవ సాక్ష్యం
దాన్ని తప్పించుకోవడం అసాధ్యం !

– మధుపాళీ, 9949700037




# పర్యావరణ పరిరక్షణలో వలస పక్షులు

## మెట్రో తెలంగాణ చావడి




కొన్ని ప్రత్యేక ప్రాంతం లేదా దేశం నుంచి నియమిత సిజన్లలో సుదూరం పయనించి వచ్చి చేరే వలస పక్షులు ప్రకృతి విందులను ఆరబోస్తూ, చూపరుల కళ్లకు విందులు చేస్తాయి. వలస పక్షుల వల్ల విత్తనాల వ్యాప్తి, పుప్పొడి వ్యాప్తి, కీటకాల నియంత్రణల ద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతోంది. ఒక దేశం నుంచి మరో దేశానికి ప్రయాణించి జీవవైవిధ్యం, దేశాల మధ్య సహకారాలకు ప్రతీకలుగా వలస పక్షులు ఉపయోగపడుతున్నాయి. వలస పక్షుల సహజ ప్రకృతి విధ్వంసం కావడం, వాతావరణంలో ప్రతికూల మార్పులు చోటు చేసుకోవడం, వేటల రూపంలో మానవ ప్రమేయం పెరగడంతో వలస పక్షుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లడంతో పర్యావరణ సహజత్వం కాపాడబడటం, ప్రజల జీవనోపాధిని నిలబెట్టడం, పంటలకు పట్టే తెగుళ్లు-కీటకాలను నియంత్రించడం, పరాగ సంపర్కానికి దోహదపడడం, విత్తన వ్యాప్తి చేయడం, పోషకాలను రవాణా చేయడం లాంటి ప్రయోజనాలు ఒనగూడుతాయి. దండయాత్ర, ఆక్రమణ, వలసవాదం, వలస వెళ్ళడం లేదా వలస రావడం అనే నాలుగు వలస పక్షుల రూపాలు ఉంటాయి. నినిభారతదేశానికి వచ్చే వలస పక్షి అతిథులు : వలస పక్షుల్లో అధికంగా తమ సంతానోత్పత్తి, ఆహారం, తమ పిల్లల్ని పెంచడం కోసం సరైన వాతావరణ పరిస్థితులను వెతుక్కుంటూ, వేల మైళ్లు ప్రయాణించి మెరుగైన ప్రకృతి కలిగిన ప్రదేశాలకు వలసలు వెళతాయి. భారతదేశంలో పక్షి జీతుల పరిరక్షణకు ప్రతి ఏట 05 జనవరి రోజున "జాతీయ పక్షుల దినోత్సవం" కూడా పాటించడం ఆనవాయితీగా మారింది. శీతాకాలంలో భారతదేశానికి వలస పక్షులు చేరడంతో పక్షి ప్రేమికుల సందర్శనాలు, వాటి సంరక్షణకు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతున్నది. వలస పక్షుల దినోత్సవాన్ని శరత్కాలంలో 10 అక్టోబర్ రోజున కూడా నిర్వహించడం చూస్తున్నాం. వలస పక్షుల పరిరక్షణకు అవసరమైన అంతర్జాతీయ సహకారం గురించి అవగాహన పెంచడానికి ప్రపంచ వలస పక్షుల దినం వేదికలు సమర్థవంత సాధనాలుగా పని చేస్తాయి. వలస పక్షులను వీక్షించడానికి ప్రత్యేక "వలస పక్షి వీక్షణ యాత్రలు" కూడా చేయడం చూస్తున్నాం. వలస పక్షులు ఒక ప్రకృతి అద్భుతం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2,000 రకాల వలస పక్షి జాతులు ఉన్నాయి. చాలా వలస పక్షులు ఉత్తర ప్రాంతాల నుంచి దక్షిణ శీతల విడిది ప్రాంతాలకు చేరతాయి. కొన్ని వలస పక్షి జాతులు దక్షిణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి చేసి తేలికపాటి ఉత్తర శీతాకాల తీర ప్రాంతాలకు వస్తాయి. ఇతర వలస పక్షులు శీతాకాల మాసాల్లో పల్లపు ప్రాంతాల్లో నివసించి, వేసవిలో పర్వత ప్రాంతాలకు చేరతాయి. ప్రతి ఏటా శీతాకాలంలో సైబీరియా, యూరప్, మధ్య ఆసియా దేశాల నుంచి చలిని తట్టుకోవడానికి, ఆహారం పొందడానికి వేలాది కిమీ ప్రయాణించి లక్షలాది వలస పక్షులు భారతదేశంలోకి చిత్తడి నేలలు, సరస్సులకు వలసలు వస్తాయి. అత్యంత ఎత్తులో ఎగిరే బార్-హెడెడ్ గూస్, సైబీరియన్ క్రేన్, అముర్ ఫాల్కన్, డెమోయిసెల్ క్రేన్, గ్రేటర్ ఫ్లెమింగో, రఫ్, ఉత్తర షోవెలర్, రోజీ పెలికాన్, గాడ్వాల్, గాడ్విన్, స్పాటెడ్ రెడ్‌షాంక్, బ్లూత్రోట్, ఆసియా కొయెల్, నల్ల కిరీట రాత్రి కొంగ లాంటి 14 రకాల వలస పక్షి జాతులు భారతదేశానికి వలసలు వస్తాయి. ప్రతి ఏటా 2వ శనివారం, అనగా 09 మే 2026న ప్రపంచ వలస పక్షుల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. 2026 ప్రపంచ వలస పక్షుల దినం ఇతివృత్తంగా "ప్రతి పక్షి ముఖ్యమే : మీ పరిశీలనలు విలువైనవి" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. వలస పక్షుల జనాభా, వాటి ఆవాసాలు, సంతానోత్పత్తి, వాటి మనుగడకు ప్రమాదకరంగా మారిన కారకాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం ప్రతి పౌరుడి బాధ్యత. ఆవాసాల నష్టం, ప్లాస్టిక్ కాలుష్యం, వాతావరణ ప్రతికూల మార్పుల కారణంగా వలస పక్షుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. వలస పక్షి జాతుల సహజ ఆవాసాలకు కాపాడుకుంటూ, వాతావరణ మార్పులను కట్టడి చేస్తూ వాటి సందడి, సందర్శనాలను ఆసాంతం ఆస్వాదిద్దాం. వలస పక్షుల అందాల విందును అనుభవిద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# జంబుకేశ్వరం అఖిలాండేశ్వరి అమ్మవారి అద్భుత రహస్యాలు!

తమిళనాడులోని జంబుకేశ్వరంలో వెలసిన అఖిలాండేశ్వరి అమ్మవారు- జలతత్వానికి అధిదేవతగా ప్రసిద్ధి- అమ్మవారి తాటంకాల దర్శనం- ప్రత్యేక ఫలప్రదంగా భావించే ఈ ఆలయ విశేషాలు. తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలో ఉన్న జంబుకేశ్వర ఆలయం పరమేశ్వరుని పంచ భూత క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పార్వతీదేవి cఅఖిలాండేశ్వరిcగా కొలువుదీరి, జలతత్వానికి అధిదేవతగా భక్తులను అనుగ్రహిస్తుంది. 1800 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో అమ్మవారు కఠోర తపస్సు చేసి శివుని నుంచి జ్ఞానాన్ని పొందిందని అంటారు. సాధారణంగా అన్ని శైవ క్షేత్రాలలో శివపార్వతుల కళ్యాణం జరుగుతుంది కానీ ఈ క్షేత్రంలో మాత్రం అమ్మవారికి, స్వామి వారికి కళ్యాణం జరగదు. ఇక్కడ అమ్మవారి దర్శనానికన్నా అమ్మవారి తాటంకాల దర్శనానికే ప్రాధాన్యత ఎక్కువ. ఈ సందర్భంగా అఖిలాండేశ్వరి అమ్మవారి ఆలయం ఎక్కడుంది? అమ్మవారి తాటంకాల మహిమ గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.

### పంచభూతాత్మకమైన పరమేశ్వరుడు

ఈ సృష్టిని ఆవరించి ఉన్న భూమి, అగ్ని, వాయువు, నీరు, ఆకాశం అనే ఐదింటిని పంచభూతాలని అంటారు. లయకారుడైన పరమేశ్వరుడు ఈ పంచభూతాలలో వ్యాపించి ఉన్నందుకు నిదర్శనంగా వివిధ ప్రాంతాలలో పంచభూత లింగాల పేరుతో కొలువై పూజలందుకుంటున్నాడు. చిదంబరంలో భూమి అంటే పృథ్వీ లింగంగా, అరుణాచలంలో అగ్ని లింగంగా, శ్రీకాళహస్తి లో వాయు లింగంగా, జంబుకేశ్వరంలో జల లింగంగా, చిదంబరంలో ఆకాశ లింగంగా పరమేశ్వరుడు పూజలందుకుంటున్నాడు.

### జంబుకేశ్వరం క్షేత్రం ఎక్కడుంది?

తమిళనాడులోని తిరుచిరాపల్లి నగరం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో జంబుకేశ్వరంలో వెలసిన జంబుకేశ్వరస్వామి గర్భగుడిలో ఎప్పుడూ భూగర్భ జలాలు ఊరుతూ ఉంటాయి. అందుకే దీనిని జల లింగం అంటారు. ఈ క్షేత్రంలో వెలసిన అఖిలాండేశ్వరి అమ్మవారు పంచభూతలింగ క్షేత్రాలలో ఒకటైన జలలింగ క్షేత్రానికి అధిష్టాన దేవత. అమ్మవారు ఇక్కడ అఖిలాండేశ్వరిగా పూజలందుకుంటుంది.

### జల లింగ క్షేత్రం

స్వామి వారు cజంబుకేశ్వరుడుcగా కొలువై ఉంటారు. గర్భాలయంలోని లింగం కింద ఎప్పుడూ నీటి ఊట వస్తూనే ఉంటుంది. అమ్మవారు స్వయంగా కావడితో నీరు తెచ్చి, జంబూ వృక్షం కింద వెలసిన శివునికి అభిషేకం చేశారని పురాణ గాథ.

### తాటంక చక్రాలు






అఖిలాండేశ్వరి అమ్మవారికి ఉన్న అతి ముఖ్యమైన ప్రత్యేకత ఆమె ధరించే తాటంకాలు. జంబకేశ్వరంలో అఖిలాండేశ్వరి దేవి దర్శనానికన్నా అమ్మవారి తాటంకాల దర్శనానికే ప్రాధాన్యత ఉండడం వెనుక ఓ పురాణగాథ ఉంది. పురాణాల ప్రకారం, ఒకప్పుడు అమ్మవారు అత్యంత ఉగ్రరూపంతో ఉండేవార! రాత్రి సమయంలో అమ్మవారు గ్రామ సంచారానికి వెళ్లి సకల ప్రాణులను భక్షిస్తూ ఉండేదం! ఆ సమయంలో అమ్మవారి ఉగ్రత్వాన్ని తగ్గించి, శాంతింప చేయడానికి ఆది శంకరాచార్యుల వారు అమ్మవారి రెండు చెవులకు మహిమాన్వితమైన తాటంకాలు, అంటే చెవి కమ్మలు కర్ణాభరణాలుగా అలంకరించి, ఆమె ఎదురుగా శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారని ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది.

### ప్రశాంత మూర్తిగా

ఆదిశంకరులు సమర్పించిన తాటంకాల వలన అమ్మవారు ఉగ్రరూపంలో నుంచి శాంత రూపంలోకి మారింద! ఇలా అమ్మవారు తన ఉగ్రత్వాన్ని వీడి శాంత స్వరూపంగా మారినందున ప్రతిరోజూ ఉదయం అమ్మవారికి పవిత్ర స్నానం పేరిట అమృత జలాలతో అభిషేకించి అనంతరం విద్యా రూపిణి అలంకారం చేస్తారు. ఇలా చేయడం వలన అమ్మవారు ప్రసన్నమూర్తిగా మారి, భక్తులపై కరుణను కురిపిస్తుందని నమ్మకం. ఈనాటికి అఖిలాండేశ్వరి అమ్మవారి తాటంకాలను దర్శించుకోవడం విశేష ఫలప్రదంగా భావిస్తారు.

### గురు-శిష్య సంబంధం సూచించే ఉపదేశ ముద్రలో

జంబుకేశ్వరం క్షేత్రంలో అమ్మవారు శివుని వద్ద శిష్యురాలిగా జ్ఞానోపదేశం పొందిందని చెబుతారు. అందుకే ఇక్కడ అమ్మవారు ఉపదేశ ముద్రలో కనిపిస్తారు. ఇక్కడ శివుడు గురువుగా, అమ్మవారు శిష్యురాలిగా పూజలందుకుంటారు.

### ఈ క్షేత్రంలో జరగని కళ్యాణం

సాధారణంగా శివపార్వతుల కళ్యాణం అన్నిశివాలయాల్లో జరుగుతుంది, కానీ ఇక్కడ శివపార్వతుల మధ్య గురు-శిష్య సంబంధం ఉండటం వల్ల కళ్యాణం నిర్వహించరు.

### గజ పూజ

అఖిలాండేశ్వరి అమ్మవారికి ఏనుగులు అంటే అత్యంత ప్రీతి. ప్రతిరోజూ ఆలయ ఏనుగు అమ్మవారి సన్నిధికి వచ్చి ప్రణమిల్లుతుంది. పూర్వం ఒక ఏనుగు మరియు సాలీడు ఇక్కడ శివుడిని పూజించి మోక్షం పొందినట్లు ఆలయ చరిత్ర చెబుతుంది.

# ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



మెట్రో న్యూస్ పెద్దపల్లి బ్యూరో. జిల్లాలోని రైస్ మిల్లుల్లో ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను రెట్టింపు వేగంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమీపంలోని అన్నపూర్ణ రైస్ మిల్లుతో పాటు పెద్ద కాల్వల వద్ద ఉన్న రాధాకృష్ణ రైస్ మిల్, సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ సాయి తేజ రైస్ మిల్, పూసాల గ్రామంలోని కళ్యాణి, పరమేశ్వర రైస్ మిల్లులు, కాట్నపల్లిలోని గౌరీనాథ్, మమతా, సదాలక్ష్మి, లక్ష్మీ గణపతి రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం అన్‌లోడింగ్, నిల్వలు, ట్యాబ్ ఎంట్రీలు మరియు ట్రక్ షీట్ల జనరేషన్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. మిల్లుల వద్ద హమాలీల సంఖ్యను తక్షణమే పెంచి, అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే మిల్లులకు పంపుతున్నందున, ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యం కోతలు విధించరాదని మిల్లర్లను ఆదేశించారు. రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా 100 శాతం ట్యాబ్ ఎంట్రీలను పూర్తి చేయాలని, ట్రక్ షీట్లను వెంటనే జనరేట్ చేయాలని అధికారులకు సూచించారు. రానున్న ఏడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, కొనుగోలు కేంద్రాల్లోనూ, మిల్లుల వద్ద ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులను సిద్ధంగా ఉంచుకోవాలని ముందస్తు జాగ్రత్తలు సూచించారు. ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, సంబంధిత శాఖల అధికారులు మరియు రైస్ మిల్లుల నిర్వాహకులు పాల్గొన్నారు.

## తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించాలి



సిరిసిల్ల, మే -09(మెట్రో న్యూస్);ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి సేకరించి తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం కల్పించిన సౌకర్యాలు, దిగుబడి వివరాలు, హమాలీల గురించి ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే జాప్యం చేయకుండా తూకం వేయాలని, అందుకు సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు? ఎంత వరకు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పూర్తయింది అనే వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించే అవకాశం ఉందని, జాప్యం చేయకుండా తరలించాలని, మిల్లుల్లో ధాన్యం బస్తాలు త్వరగా అన్ లోడ్ అయ్యేలా పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. తనిఖీలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్, తదితరులు ఉన్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి**


**అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**



జగిత్యాల జిల్లా ప్రతినిధి, మే 09 (మెట్రో న్యూస్) : వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలనీ, తూకం వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి అని, అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ రైతులకు సూచించారు. శనివారం జిల్లాలోని ధర్మపురి మండలం పెద్ద నక్కల పేట, దోనూరు, తిమ్మాపూర్, వెల్గటూర్ మండలం శాఖాపూర్ గ్రామంలోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో జిల్లాలో అకాల వర్షాలు ఉన్నందున వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు కొనుగోలు కేంద్రాల నిర్వహకులు గన్ని సంచులు, టార్ఫలిన్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టార్ఫాలిన్ కవర్లు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకొని పాడీని ప్రొటెక్ట్ చేయాలని అన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాలు ఉన్నందున ఉరుములు మెరుపులతో కూడుకున్న వర్షాలు కురిస్తే రైతులు చెట్ల కింద, కరెంటు పోల్స్ వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పరిశీలనలో మండల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం




చిగురుమామిడి: (మెట్రోన్యూస్)రేకొండ గ్రామంలో శనివారం గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మేగా వైద్య శిబిరం నిర్వహించామని ట్రస్ట్ ఫౌండర్ గంగిశెట్టి జగదీశ్వర్ తెలిపారు. ఈశిబిరాన్ని గ్రామ సర్పంచ్ అల్లేపు సంపత్ ప్రారంభించి వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఇక్కడ శ్రీనివాస విజన్ సెంటర్ చిగురుమామిడి, మెడికవర్ హాస్పిటల్ వారు 258 మందికి ఉచితంగా బిపి, షుగర్, ఈసిజీ, కంటి,వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి చుక్కలు పంపిణీ చేశారు. పరీక్షలు చేపించుకున్న వారిలో 29మందికి కంట్లో పొరలు ఉన్నట్లు గుర్తించి, వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేపిస్తామని కంటి పరీక్ష నిపుణులు తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోదారి అజయ్ కుమార్, డాక్టర్ (సామాజిక సేవవేత్త) తిపారపు శ్రీనివాస్,ఆసుపత్రి సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి గంగుల కమలాకర్ అరెస్ట్

**పోలీసులకు బిఆర్ఎస్ కార్యకర్తలకు తోపులాట**



కరీంనగర్ బ్యూరో మెట్రో న్యూస్ కరీంనగర్‌లో పట్టణం బిఆర్ఎస్ పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ను పోలీసులు శుక్రవారం ఉదయం అరెస్ట్ చేశారు. ఇంటి నుంచి బయటకు వచ్చిన గంగుల కమలాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. "బీజేపీ డౌన్ డౌన్", "బండి సంజయ్ డౌన్ డౌన్" అంటూ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా కార్యకర్తలను లేడీ పోలీసుల్లేకుండానే అదుపులోకి తీసుకున్నారంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. మహిళలను బలవంతంగా ఈడ్చుకెళ్లారని ఆరోపిస్తూ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకోగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి అదుపుతప్పకుండా ఉండేందుకు అదనపు బలగాలను రంగంలోకి దించారు. దాదాపు వందమందికి పైగా నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. నగరంలోని పలు పోలీస్ స్టేషన్లకు వారిని తరలించినట్లు తెలిసింది. ఇక గంగుల కమలాకర్ అరెస్టును బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కును ప్రభుత్వం అణిచివేస్తోందని మండిపడ్డారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కరీంనగర్ నగరమంతా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బొడ్రాయి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర...






రేగొండ,మే9(మెట్రో న్యూస్): భూలక్ష్మి మహాలక్ష్మి తల్లుల దీవెనలు ఆశీస్సులు ప్రజలపై ఉండాలని గ్రామాల్లో రైతుల పాడి పంటలు సమృద్ధిగా పండాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గ్రామ దేవతలను కోరుకున్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గం గోరికొత్తపల్లి మండలం, విజ్జయ్యపల్లి గ్రామంలో మొగుళ్ళపల్లి మండలం ఆకినపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట ఉత్సవాలు గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి ఉత్సవాల్లో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర పాల్గొనగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..గ్రామ ప్రజలందరూ కలిసి ఎంతో రంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న బొడ్రాయి మహోత్సవ కార్యక్రమంలో బంధుమిత్రులు బంధువులతో ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేయడం సంతోషకరమైన విషయాలని..ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర గ్రామ దేవతలను వేడుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గండ్ర మహిళలకు చీరలను అందజేశారు. బొడ్రాయి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డితో పాటు గోరి కొత్తపల్లి మండల టిఆర్ఎస్ అధ్యక్షులు ఎంప హామీద్, సర్పంచ్ నిమ్మల శంకర్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ కానుగంటి శ్రీనివాస్, గండ్ర యువసేన టౌన్ అధ్యక్షులు సూధనబోయిన సుమన్, పరమాణుల చక్రపాణి గౌడ్, మాజీ సర్పంచ్ మాచర్ల ఐలయ్య యాదవ్, జయ పల్లె ఉపసర్పంచి సాంబయ్య, సీనియర్ నాయకులు అబ్బ ప్రకాశ్ రెడ్డి, గుండు సదానందం, కోనూరు సదానందం గౌడ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**-ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కృషితో వేములవాడ పలు దేవాలయాలు అభివృద్ధి చేయడం జరుగుతుంది: చైర్మన్ పుల్కం రాజు**
**-హనుమంతుడి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలి: చైర్మన్**
**-జైశ్రీరామ్.. జై హనుమాన్ నామస్మరణతో మారు మోగిన ఆధ్యాత్మిక క్షేత్రం**



మెట్రో న్యూస్, వేములవాడ/రాజన్న సిరిసిల్ల జిల్లా: హిందూ ధర్మ సంస్కృతిని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ పుణ్యక్షేత్రంలో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలను పురస్కరించుకొని, హనుమాన్ దీక్షా సేవ సమితి ఆధ్వర్యంలో శనివారం శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్, ఆంజనేయ స్వామి వారి చిత్రపటానికి పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తో పాటు అనుబంధ దేవాలయాలు అభివృద్ధి లక్ష్యంగా వెళ్లడం జరుగుతుంది. ప్రతి ఏటా కమిటీ సభ్యులు ఎంతో నిబద్ధతతో ఈ శోభాయాత్రను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భక్తి భావం మనిషిలో క్రమశిక్షణను, సామాజిక స్పృహను పెంపొందిస్తుందని, ఇలాంటి పవిత్ర కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని హర్షం వ్యక్తం చేశారు. హనుమంతుడి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు, నగరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి వారికి పంచామృతాలు, క్షీరంతో శాస్త్రోక్తంగా అభిషేక ప్రక్రియను నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ప్రారంభమైన శోభాయాత్ర జై శ్రీరామ్.. జై హనుమాన్ నామస్మరణతో వేములవాడ వీధులన్నీ మారుమోగిపోయాయి. భక్తుల జయజయధ్వానాలు, బాజాభజంత్రీల కోలాహలం మధ్య ఈ యాత్ర కనుల పండువగా సాగింది. ఈ వేడుకల్లో అయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కౌన్సిలర్లు కొండ రాజశేఖర్, కొక్కుల బాలకృష్ణ, నాయకులు బోనాల శివ, మూడపెల్లి నాగరాజు, సనుగుల సత్యం, ఎడ్ల శ్రీనివాస్, గోపు రాజేశం, మరిగడ్డ లచ్చయ్య, పోతారం సాయి తదితరులతో పాటు హనుమాన్ దీక్ష సేవ సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాపయ్య పల్లె గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర



జమ్మికుంట, మెట్రో న్యూస్జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామంలో హనుమాన్ మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ శోభాయాత్రను శనివారం గ్రామంలోనీ పురవీధులగుండ ఊరేగించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ ఉత్సవమూర్తికి వివిధ రకాల పూలతో ఘనంగా అలంకరించి వాహనంపై అధిరోహించారు. అనంతరం గ్రామంలోని పురవీధులగుండ స్వామివారిని ఊరేగించారు. హనుమాన్ మాలధారణ స్వాములతో పాటు మహిళలు డప్పు చప్పుళ్ళు,మేళా తలాలతో కోలాట నృత్యలు చేస్తూ అంగరంగ వైభవంగా శోభయాత్రను నిర్వహించారు. గ్రామ ప్రజలు భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు గుండెకారి మధు,శంకర్, తోపాటు మాలాధారణ స్వాములు వజ్జపల్లి రాజు,కొల్లూరి రాకేష్,ఆరేపల్లి శివకృష్ణ,పవన్ కుమార్, మహేందర్,రాములు,సంతోష్,నరేష్,మనోహర్ స్వాములు పాల్గొన్నారు.

# రామడుగు లో జనగణన కు ప్రజలు సహకరిచాలి

రామడుగు మెట్రో న్యూస్..భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జనగణనఉ2027 కార్యక్రమంలో భాగంగా రామడుగు మండల పరిధిలో ఇండ్ల గణన కార్యక్రమం 11.05.2026 నుండి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తహసీల్దార్ బండి రాజేశ్వరి తెలిపారు. ఇండ్ల గణన ప్రక్రియలో ప్రతి ఇంటిని సందర్శించి నివాస వివరాలు, గృహ సౌకర్యాలు, కుటుంబ వివరాలు తదితర సమాచారాన్ని సేకరించనున్నారు. ప్రజలు సరైన సమాచారం అందించి జనగణన సిబ్బందికి సహకరించాలని అధికారులు కోరారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ఈ వివరాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల మండల ప్రజలందరూ జనగణన సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ & చార్జ్ అధికారి, ఎంపిడివో అడిషనల్ ఛార్జ్ అధికారి విజ్ఞప్తి చేశారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
నల్గొండ-ఖమ్మం
సూర్యాపేట | కొత్తగూడెం
యాదాద్రి భువనగిరి | భద్రాద్రి
epaper.metroevenings.com


## దోబి కార్మికురాలిని విధుల నుంచి తొలగించడం అన్యాయం

**చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్త కొండ శ్రీలక్ష్మి**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి:గత 23 సంవత్సరాలుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దోబి వృత్తి చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్న దోబి కార్మికురాలు అక్కినపల్లి జానకి ని అకారణంగా విధుల నుంచి తొలగించడంతో ఆమె కుటుంబం రోడ్డున పడిందని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కొత్త కొండ శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా పార్క్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సట్టు నాగయ్య తో కలిసి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మిషనరీ దోబి కాంట్రాక్ట్ ఫారుఖ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ్, ఆర్ఎం జనార్దన్ లు జానకి పై నోటికి వచ్చినట్లు మహిళ అని చూడకుండా దుర్భషలాడుతూ ఆమెను విధుల నుంచి తొలగించడం హేయమైన చర్య అన్నారు. రోగుల దుస్తులు, ఇతర రక్తపు మరకలు ఉన్న వస్త్రాలను ఉతికే జానకిని, ఎందుకు తనను తొలగించారని ఆమె అడగడంతో వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వారు బూతులు తిడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్, సూపరింటెండెంట్, ఆర్ఎంలు తమకు రాజకీయ అండ ఉందని తమను ఎవరు ఏం చేయలేరని, ఎవరికి చెప్పకుంటావో చెప్పుకొమ్మని బెదిరింపులకు దిగితున్నారని ఆరోపించారు. తక్షణమే దోబి కార్మికురాలు అక్కినపల్లి జానకి ని విధుల్లోకి తీసుకోవాలని లేదంటే తమ కులస్తుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాచకొండ గీత, మర్రిపల్లి స్వప్న, శ్రావణి, మర్రిపల్లి మల్సూర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు స్వీయ జనగణనలో

# నమోదు చేసుకోవాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: స్వీయ జనగణనలో ఒక్క రోజే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. 2027 జనగణనలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా స్వీయ గణన చేసుకునేందుకు ఈ నెల 10వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉన్నదని తెలిపారు. ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకునే ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. హ్ట్ట్ప్స్://ఒవ.షెవఅంబం.గ్రశీజ.ఙఅ అనే వెబ్‌సైట్ ద్వారా ఇంటి వద్ద నుండే సులభంగా స్వీయ గణన నమోదు చేసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే ఈ ప్రక్రియ పూర్తి సులభంగా నమోదు చేయవచ్చుని, నచ్చిన భాషను ఎన్నుకొని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. గత నెల 26వ తేదీ నుండి ప్రారంభమైన స్వీయ గణన ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈ నెల 10వ తేదీతో ముగుస్తుందని స్పష్టంచేశారు.జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన, అనంతరం గృహాల లెక్కింపు, తదుపరి పూర్తి జనగణన నిర్వహిస్తారని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి హౌస్ లిస్టింగ్ చేపడతారని తెలిపారు.దేశ ప్రణాళిక, భవిష్యత్ అభివృద్ధి, వనరుల పంపిణీకి జనగణన కీలకమని కలెక్టర్ తెలిపారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్నవారు కూడా తమ ప్రస్తుత నివాసం నుండే వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు.జనగణన సందర్భంగా అందరూ తమ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఖచ్చితంగా అందించాలని కోరారు. ఈ వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, జనాభా లెక్కలకు మాత్రమే ఉపయోగించబడతాయని స్పష్టం చేశారు. ఆన్లైన్ నమోదు తదుపరి ఎన్యుమరేషన్ ఐడి వస్తుందని, నంబర్ ఆధారంగా ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఒక్క రోజే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలని ఆయన సూచించారు.

## తీవ్రమైన కిడ్నీ వైఫల్య సమస్యకు యశోద ఆసుపత్రిలో దేవరకొండ వాసికి

## విజయవంతమైన చికిత్స




దేవరకొండ. మెట్రో న్యూస్....దేవరకొండ మండలంలోని ఘాజీనగరం గ్రామానికి చెందిన 32 ఏళ్ల చక్కని కి యశోద హాస్పిటల్ లో కిడ్నీకి సంబంధించిన వ్యాధికి సరైన చికిత్స లభించింది ఆక్యుట్ కిడ్నీ ఇంజరీ అనేది తక్కువ సమయంలోనే కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదకర పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ఇది వేగంగా అభివృద్ధి చెంది రాపిడీ ప్రోసిప్ రీనల్ ఫెయిల్యూర్ గా మారి ప్రాణాపాయ పరిస్థితులకు దారితీస్తుంది. శరీరమంతా వాపులు, మూత్ర విసర్జన తగ్గిపోవడం, రక్తంలో వ్యర్థాలు పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సందర్భాల్లో ముందస్తు నిర్ధారణ, ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స, సమయానికి వైద్య జోక్యం అత్యంత కీలకం. దేవరకొండకు చెందిన 32 ఏళ్ల చిన్న చక్కని పద్మ జ్వరం, వణుకులు, అనంతరం శరీరమంతా వాపులతో బాధపడుతూ యశోద సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్పేట్లో చేరారు. ఆమెకు మూత్ర విసర్జన కూడా తగ్గిపోవడంతో ముందుగా ఇతరచోట చికిత్స ప్రారంభించి, తదుపరి ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స కోసం యశోద ఆసుపత్రికి రిఫర్ చేశారు.అత్యాధునిక పరీక్షలు ప్రత్యేక నెఫ్రాలజీ చికిత్స డా. చేతన్ వీరమనేని, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ & రీనల్ ట్రాన్స్మాంట్ ఫిజీషియన్ ఆధ్వర్యంలో రోగికి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో వ్యాధి మూలకారణాన్ని గుర్తించేందుకు అల్ట్రాసౌండ్ మార్గదర్శకత్వంలో రియల్టైమ్ రీనల్ బయాప్సీ నిర్వహించి చిన్న వయసురాలైన ఆమెను ప్రాణాపాయం లేకుండా కాపాడారు

## రాయినిగూడెంలో ఘనంగా 'రైతు వారం' కార్యక్రమం

**చెరువుల సంరక్షణతోనే వ్యవసాయాభివృద్ధి:**

**ఇరిగేషన్ ఈఈ రామ్ కిషోర్**




మెట్రో న్యూస్,(మే 09 ),గరిడేపల్లి:ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికను పురస్కరించుకుని, నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం రాయినిగూడెం గ్రామంలోని సూరల్ దేవి చెరువు వద్ద 'రైతు వారం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గుండు రామంజి గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్ కిషోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈఈ రామ్ కిషోర్ మాట్లాడుతూ రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, చెరువుల కింద ఆయకట్టును అభివృద్ధి చేయడమే ఈ 99 రోజుల ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సూరల్ దేవి చెరువు పరిరక్షణకు శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్లు నవికాంత్, హరికృష్ణ (మేళ్లచెరువు-చింతలపాలెం), వెంకటేశ్వర్లు (హుజూర్ నగర్-మఠంపల్లి) పాల్గొని రైతులకు సాంకేతిక సలహాలు అందించారు. అలాగే ఏఈలు జీవన్ కుమార్, వీరబాబు, సిద్ధార్థ్, వర్క్ ఇన్స్పెక్టర్లు మరియు లస్కార్లు, ఉప సర్పంచ్ పిడమర్తి నాగరాజు, మాజీ ఎంపీటీసీ సందీప్, మాజీ సర్పంచ్ కడప దేవదానం, పంచాయతీ కార్యదర్శి సునీత, గ్రామ శాఖ అధ్యక్షుడు గుండు శంభయ్య, వార్డు మెంబర్లు అమరారపు కరుణాకర్, గుండు గురవయ్య, త్రిమూర్తి రాజు, కంపాటి రాజు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**అదనపు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది అవసరం..**

**రాంగ్ రూట్ ఫోటో కొట్టడమే కాకుండా అవగాహన కల్పించాలి**

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.**



మిర్యాలగూడ, మెట్రో న్యూస్. మిర్యాలగూడ పట్టణ ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే లక్ష్యం గా చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులపై శుక్రవారం రాత్రి సాగర్ రోడ్డు పై నిర్మిస్తున్న డివైడర్లు, ట్రాఫిక్ జంక్షన్ లో పనితీరును డివిజన్ పోలీస్ అధికారులతో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ వాహనాల రద్దీకి సంబంధించి అదనపు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది అవసరమని, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది రాంగ్ రూట్ ఫోటో కొట్టడమే కాకుండా అవగాహన కల్పించాలని సూచించారు.గత నాలుగు రోజులుగా మారుతున్న ట్రాఫిక్ గమగమనాలు,కొత్త డివైడర్ల వల్ల కలుగుతున్న మార్పులను అధికారులతో కలిసి విశ్లేషించారు.

## లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలకు సమాంతరంగా బెల్ట్ షాపులు..!

**అందుబాటులో ఎనీ టైం మందు**

**సిండికేట్ రాకెట్ కు కాసుల వర్షం**

**ఆగని దందా కోట్లకు పడగలు**

**అక్రమ మద్యం వ్యాపారంపై ఎక్సైజ్ శాఖ చర్యలు శూన్యం**




భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(మెట్రో న్యూస్):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం పరిధిలోని లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలకు సమాంతరంగా "బెల్టు షాపులు" నడుస్తున్న దారుణ పరిస్థితి నెలకొంది. దీంతో బెల్ట్ షాపుల్లో "ఎనీ టైం" మందు అందుబాటులో ఉంటుంది. ఫలితంగా సిండికేట్ రాకెట్ కు కాసుల వర్షం కురుస్తుంది. అంతేకాకుండా బెల్ట్ షాపుల ద్వారా సిండికేట్ గాళ్లు కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడంలో సాహసించడం లేదు. కిరాణ దుకాణాలు, పాన్ డబ్బాలు, ఇళ్లలో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. లైసెన్స్‌డ్ దుకాణాలు మూసి ఉన్న సమయాల్లో పట్టణాలకు, దూరంగా ఉన్న గ్రామాల్లో బెల్టుషాపుల్లో ఎక్కువ అమ్మకాలు సాగుతున్నాయి. పగలూ రాత్రి తేడా లేకుండా అన్ని సమయాల్లోనూ గ్రామాల్లో మద్యం అందుబాటులో ఉంటుండడంతో యువత మద్యానికి బానిసై పాడువుతున్నారని తల్లిదండ్రులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి బానిసై పనులకు వెళ్లకుండా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రతి గ్రామంలో కనీసం రెండు నుంచి పది వరకు దుకాణాలు, ఇళ్ల వద్ద అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్నారు. తమ గ్రామంలో మద్యం అమ్ముతున్నారని ఫిర్యాదు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు. పలు గ్రామాల్లో బెల్టు దుకాణాలను జోరుగా నడిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వారికి మామూళ్లు ముట్టడం వల్లే చర్యలు తీసుకోవడం లేదని పట్టణ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జాతీయ పర్వదినాల సందర్భాల్లో ప్రభుత్వం మద్యం దుకాణాలను మూసి వేసిన సమయాల్లోనూ మద్యం ప్రియులు బెల్టుషాపులకు వచ్చి మద్యాన్ని కొనుక్కు వెళ్తున్నారంటే ఇక్కడ మద్యం ఎంతగా అందుబాటులో ఉంటుందో తెలుస్తోంది. బెల్టు షాపుల నిర్వాహకులు సాధారణ రోజుల్లో ప్రతీ బాటిల్‌పై పరిమాణాన్ని బట్టి ఎమ్మార్పీపై రూ.15 నుంచి 50 వరకు ఎక్కువ తీసుకొని మద్యం విక్రయిస్తున్నారు. ఇకనైనా ఆబ్కారీ అధికారులు బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే స్థానిక పోలీసులు పట్టణ పరిధిలోని గ్రామాల్లో గస్తీ చేపట్టి అక్రమ మద్యాన్ని అరికట్టాలని మహిళలు అంటున్నారు.

# జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

**అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి**

**ఈనెల 10 వరకు ప్రతి ఒక్కరు స్వీయ గణన చేసుకోండి**

**సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది**

**అభివృద్ధికి మూలమైన జనగణ లో పాల్గొనండి.**

**జనగణన పై అవగాహన వాక్ ర్యాలీ ని ప్రారంభించి పాల్గొన్న అదనపు కలెక్టర్**



ఖమ్మంమెట్రో ఈవెనింగ్ మే 09 :జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది అని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జనగణనపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నుండి జడ్పీ సెంటర్ వరకు నిర్వహించిన జనగణన అవగాహన వాక్ ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి, క్రీడాకారులు, ప్రజలు, వాకర్స్ తో కలిసి ర్యాలీ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన విధానం మే 10 వరకు జరుగుతుందని, ఈ స్వీయ గణనలో స్వచ్ఛందంగా నమోదు చేసుకోసుకొని, ఈ స్వీయ నమోదు శాతాన్ని మరింతగా పెంచాలని, అందరూ ఈ స్వీయ గణనలో నమోదు చేసుకోవాలని కోరారు. మే 11వ తేదీ నుంచి ఇంటింటి గణన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందులో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఈ వివరాలు అంతా కూడా గోప్యంగా ఉంటుందని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, ప్రజలు ఎటువంటి భయం పడాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అదే విధంగా జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన వాక్‌లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు.జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు.దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, "మన సమాచారం ఉ మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీవో శ్రీనివాస్, డీఎస్డీవో సునీల్ రెడ్డి, ఎస్ఓ శ్రీధర్, డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు, నగర ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వివాహ వార్షికోత్సవ వేడుకలు



కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ మే 9:వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ - లలిత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను శనివారం సింగరేణి మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జంట అందరికి ఆదర్శం గా ఉండి,కలకాలం అష్టైశ్వర్యాలతో సుఖంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు బానోత్ హీరాలాల్, మోతి వీరాస్వామి,అంగోత్ మత్రు,నునావత్ కిరణ్,సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య,పార్టీ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్,మేదరి రాజా, మండల పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు హనీఫ్,మండల కిసాన్ ఖేత్ కడియాల సుధాకర్,తదితరులు పాల్గొన్నారు

## లింగం బంజర లో ధ్వజస్తంభ ప్రతిష్ట

**భారీగా తరలివచ్చిన భక్తులు,**

**అన్న వితరణ కార్యక్రమం**



కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ మే9: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ లింగం బంజర గ్రామంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్ట మహోత్సవానికి పరిసర ప్రాంతాల నుండి భారీగా భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని తిలకించారు. గ్రామస్తుల సమిష్టి కృషితో ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం జరిగింది. అర్చకులు అచ్యుత రామారావు శర్మ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు ఈ ప్రతిష్ట మహోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో భక్తులు ముక్తకంఠంతో జైశ్రీరామ్, జై శ్రీ హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ భక్తి పరవశంతో మురిసిపోయారు. అలాగే ఇదే గ్రామంలో నిర్మాణం చేసిన గంగమ్మ తల్లి ఆలయంలో వేద పండితుల వేద మంత్రోచ్చరణ నడుమ ఆలయంలో గంగమ్మ తల్లి, అంకమ్మ తల్లి విగ్రహాలతో పాటు పోతురాజు విగ్రహాలను ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీ అభయ ఆంజనేయ ఆలయ కమిటీ సభ్యుల నేతృత్వంలో అన్న వితరణ కార్యక్రమం వైభవంగా జరిగింది.

# 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకుడిపై కేసులు.




గద్వాల మే 9 (మెట్రో న్యూస్):10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు,బీఆర్ఎస్ నాయకుడిపై కేసులు.కౌన్సిల్ సభ్యులుగా మా హక్కుల కోసం ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించారు.కో ఆప్షన్ ఎన్నికలను ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నిర్వహిస్తున్నారని మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించగా సమాధానం ఇవ్వకుండా పోలీసుల అండతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు మండిపడ్డారు.కో ఆప్షన్ ఎన్నికల నామినేషన్ దాఖలుకు చివరి రోజు అయిన 23-04-2026న మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు స్వీకరించేందుకు ఎలాంటి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయలేదని అధికారులు కూడా అందుబాటులో లేకపోవడంతో కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించామని తెలిపారు.దీనికి ఇన్వర్డ్‌లో ఇచ్చి వెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు.ఈ చర్యలు కమిషనర్ అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు.కేసులకు భయపడేది లేదు.కౌన్సిలర్లుగా మా హక్కుల కోసం,ప్రజల పక్షాన పోరాడుతాం.తప్పుడు పని చేసే ప్రతి అధికారిని నిలదీస్తాం అని బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు.కేసులు నమోదైన వారిలో పులిపాటి వెంకటేశ్,టిఎన్ఆర్ జగదీష్,గువ్వల గోపాల్,మోహన్ యాదవ్,సంటేన్న,చిన్న రాముడు,నరసింహ,మ్మరి సునీత,గంగాళం మంజుల రాణి,లతతో పాటు బీఆర్ఎస్ నాయకుడు చిత్తారి కిరణ్ ఉన్నారు.

# వీధి దీపాల ఏర్పాటులో అక్రమాలు

## సి ఆర్ పి ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు



తాడూరు:---- (మెట్రో న్యూస్:మే 9)నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటుచేసిన వీధి దీపాలలో ఆర్థిక అక్రమాలు చోటు చేసుకున్నాయని జిల్లా కలెక్టర్,జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రేవోల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ రాష్ట్ర కార్యదర్శి,తాడూరు మండలం బలాన్ పల్లి వార్డు సభ్యుడు వి.బసవయ్య కలెక్టర్ కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాడూరు మండలంలోని బలాన్ పల్లి,ఇంద్రకల్,లచ్చిరాం తండ, తాడూరు,గుంతకోడూరు యంగంపల్లి గ్రామాలలో వీధిదీపాలను ఏర్పాటు చేశారు. మార్కెట్ ధర 750 రూపాయలు ఉన్న ఒక్క ఎల్ఈడి లైట్లు 3000 రూపాయల నుంచి 4 వేల రూపాయల వరకు చూపించి నకిలీ బిల్లులు సృష్టించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక బలాన్ పల్లి గ్రామంలోనే 150 నుంచి 160 లైట్లు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి 4,90,000 రూపాయలను 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి డ్రా చేయడానికి ఎంబి రికార్డులను పూర్తి చేసి అధికారులు కాంట్రాక్టర్ కుమ్మక్కై నిధులను డ్రా చేయడానికి చూస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సమగ్ర విచారణ జరిపి వీధి దీపాల ఏర్పాటుకు సంబంధించిన బిల్లులను నిలిపివేయాలని గ్రామ కార్యదర్శి పంచాయతీరాజ్ ఏఈ కాంట్రాక్టర్ పాత్ర పై సమగ్ర విచారణ జరపాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మార్కెట్లో తక్కువ ధరకు లభించే వీధిలైట్లను ఇష్టానుసారంగా ధరలు పెంచి కాంట్రాక్టర్ తో కుమ్మక్కై అధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో 140 మేడే జెండా ఆవిష్కరణ




ఆత్మకూరు మండలం మెట్రో న్యూస్ ఆత్మకూరు మున్సిపాలిటీ కేంద్రంలో 140 మే డే ను సందర్భంగా జండా ఆవిష్కరణ సిఐటియు నాయకులు మహమ్మద్ జెండా ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ఎం రమేష్ వారు మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికుల పరిస్థితులు నానాటికి దుర్భరంగా తయారయ్యాయి కనిస వేతనాలు ఎక్కడ అమలు కావడం లేదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రతి కార్మికుడికి 24 వేల వేతనం కచ్చితంగా ఉండాలని తీర్పునిస్తే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించి వాటిని అమలు చేయకుండా 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లను కిందికి తీసుకొచ్చి గత నెల ఏప్రిల్ నుంచి దేశంలో అమలు చేయాలని చూస్తుంది ఆ నాలుగు లేబర్ కోడుల ద్వారా కూడా కార్మికుల హక్కులు కాల రాయపడుతుందని దేశ ప్రజలంతా ఈ కూడు ఏ లేబర్ కోడ్లను తిప్పి కొట్టాలని 1886 స్ఫూర్తితో మరోసారి కార్మికులంద ఏకమై బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుజ్ఞానం అరుణ్ రవి నిశాంత్ భారతీయుడు రవి ప్రకాష్ మహమ్మద్ జి పి తదితరులు పాల్గొన్నారు

# చెరువు మట్టి కాదు... కోట్ల కమీషన్ల ఆట!"

# ఇటుక బట్టీల నుండి కోట్లలో వసూళ్లు

**ధన్వాడలో ఒండ్రు మట్టి దందా వెనుక అధికార పార్టీ హస్తం..?**

**రైతులకు దక్కాల్సిన ప్రజాసంపదపై రాజకీయ మాఫియా పంజా అన్న**




మెట్రో న్యూస్। నారాయణపేట.ప్రజాపాలన ప్రభుత్వంలో అధికార పార్టీ ఉండు మట్టి దోపిడి బహిరంగంగా జరుగుతుంది,నారాయణపేట జిల్లా ధన్వాడ చెరువులో జరుగుతున్న ఒండ్రు మట్టి తరలింపు వ్యవహారం ఇప్పుడు రాజకీయ, పరిపాలనా,వర్గాల్లో,తీవ్రచర్చ నీయాంశంగా మారింది. ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన చెరువు మట్టిని అధికార పార్టీ నాయకుల లాభాల కోసం విక్రయిస్తున్నారనే ఆరోపణలు గ్రామస్థులు, రైతులు, మత్స్యకారుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. గత సంవత్సరంలో ఇటుక బట్టీలకు తరలించిన ఉండు మట్టి విలువ దాదాపు 20 కోట్లకు చేరింది, దీంతో చెరువులో అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్న రైతుల ఫిర్యాదుతో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పందించి 20 టిప్పర్లపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు అదే వ్యవహారం మరింత పెద్ద ఎత్తున కొనసాగుతుండటంపై ప్రజల్లో అనుమానాలు, వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం నారాయణపేట నీటిపారు దల శాఖ అధికారులు 32 భారత్ బెంజ్,టిప్పర్లకు,అనుమతులు ఇవ్వడం వివాదానికి కేంద్రబిందువైంది. రైతుల పొలాలకు ఉచితంగా చేరాల్సిన ఒండ్రు మట్టిని కర్ణాటక రిజిస్ట్రేషన్ వాహనాల్లో మక్తల్, మరికల్ ప్రాంతాలకు తరలిస్తూ ఇటుక బట్టీల యాజమాన్యాలకు కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్థానిక రైతులకు సరైన సమాచారం



ఇవ్వకుండా, గ్రామసభ లేకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా అనుమతులు మంజూరు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో నీటిపారుదల శాఖ అధికారులు అధికార పార్టీ నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు మరింత తీవ్రంగా మారాయి. ముఖ్యంగా స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్ సదానందం పేరును గ్రామస్థులు బహిరంగంగా ప్రస్తావించడం కలకలం రేపుతోంది.శనివారం భారీగా ఒండ్రు మట్టి తరలింపును గమనించిన రైతులు, మత్స్యకారులు, గ్రామస్తులు ట్రిప్పర్లను అడ్డుకున్నారు. మత్స్యకార సంఘం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ“అభివృద్ధి పేరుతో చెరువును ఖాళీచేసి,మట్టినిఅమ్ముకుంటే చూస్తూ ఊరుకోము. చెరువులో ఎక్కడపడితే అక్కడ గుంతలు తవ్వడంతో చేపల వేట ప్రమాదకరంగా మారింది. మూగజీవాలకు తాగునీరు కూడా లేకుండా పోతుంది” అని ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామస్థుల ఆందోళనకు అధికారులు చూపించిన అనుమతి పత్రాలుమరింత,అనుమానాలకు తావిస్తున్నాయి. “రైతుల కోసం” అంటూ తీసుకున్న అనుమతులను రాజకీయ వ్యాపారంగా మార్చేశారని స్థానికులు,మండిపడుతున్నారు. అక్రమాలను ప్రశ్నించిన వారిపై గతంలో కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడ్డారని కూడా ఆరోపిస్తున్నారు.ఇదిలా ఉండగా,నియోజకవర్గ ప్రజల్లో మరో ప్రశ్న వినిపిస్తోంది

**“ప్రజాసంపద దోపిడీ జరుగుతుంటే,ప్రజాప్రతినిధులు ఎక్కడున్నారు..?”**


ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో మాత్రం అధికార పార్టీ నాయకుల ఆదేశాలకే పరిమితమైందా..? అధికారులు ప్రజలకా, రాజకీయ నేతలకా పనిచేస్తున్నారు..? అనే ప్రశ్నలు ఇప్పుడు ధన్వాడలో గట్టిగా వినిపిస్తున్నాయి.చెరువు మట్టిని అమ్మకానికి పెట్టి కోట్ల రూపాయలు దండుకుంటున్న మట్టి మాఫియాపై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ జరిపి అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని రైతులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆస్తిని కాపాడాలని, రైతులకు ఉపయోగపడేలా ఒండ్రు మట్టిని పొలాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు,

# నిమ్జ్ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**-మౌలిక సదుపాయాలు, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్ కు ఆదేశాలు**

**-నిమ్జ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష**



మెట్రో న్యూస్ జహీరాబాద్:జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (నిమ్జ్) పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, ఎక్విప్మెంట్‌ను పెంచి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వర్క్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మౌలిక వసతుల ఏర్పాట్లలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం కలెక్టర్ జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వీరారెడ్డితో కలిసి జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిమ్జ్ పరిధిలోని భూముల అభివృద్ధి, సేకరించిన భూముల ప్రస్తుత స్థితి, పెండింగ్ సమస్యలు, స్వాధీనం చేసుకున్న భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు తదితర అంశాలపై టీజీఐఐసీ, నిమ్జ్, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు నిమ్జ్ భూముల మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్, ఇప్పటివరకు సేకరించిన భూములు, ఇంకా సేకరించాల్సిన భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమల అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. సేకరించిన భూమిలో చుట్టు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఈ సమావేశంలో జోనల్ మేనేజర్ విఠల్, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, రెవెన్యూ డివిజనల్ అధికారి దేవూజ, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీస్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట..

**తెల్లాపూర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





(మెట్రో న్యూస్)రామచంద్రాపురం :సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల సేవలు అత్యంత ప్రశంసనీయమని.. వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం రామచంద్రపురం మండల్ తెల్లాపూర్ డివిజన్ పరిధిలో గల శ్రీ శ్రీ శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సోమిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం చారి,గోపాల్ చారి,ప్రకాష్ చారి, భీమ్ లింగం చారి, శ్రీరాములు చారి,శివశంకర్ చారి,మల్లారెడ్డి, దేవేందర్ యాదవ్, లచ్చి రామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, మాజీ ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# జగదాంబ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది

**-సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**



మెట్రో న్యూస్ కొండాపూర్:కొండాపూర్ మండలం శివన్న గూడెం తండాలోని జగదాంబ సేవాలాల్ ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు తండా ప్రజలు, యువకులు లంబాడ సంప్రదాయ వస్త్రధారణతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో లంబాడ సంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా తండాలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం, మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో తండా ప్రజలు తనకు మంచి మెజార్టీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ.. తండా అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. అలాగే జగదాంబ సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కూడా తన వంతు సహాయం అందిస్తానన్నారు. జగదాంబ సేవాలాల్ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద్, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, మల్లేశం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, యువకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# వీరభద్రుడిని దర్శించుకున్న కౌన్సిలర్



మెట్రో న్యూస్ రాయికోడ్:మండల కేంద్రంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన శ్రీ భధ్రకాళి సమేత వీరభధ్రేశ్వరస్వామిని జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలోని 22వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ రాయికోడ్ లోని పురాతన ఆలయమైన భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.కుటుంబసభ్యులతో కలిసి విచ్చేసిన ఆయనకు ఆలయ పురోహితులు ఆశీర్వచనం చేసి శాలువా, పూల మాలలతో సన్మానించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్రను కౌన్సిలర్ అక్కడి నిర్వాహకులు,స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎన్.రమేష్,జూనియర్ అసిస్టెంట్ కృష్ణ,అర్చకులు వీరయ్య స్వామి,బస్వరాజ్ స్వామి,సంగయ్య స్వామి,అనురూప్ గౌడ్, స్థానికులు శివప్రసాద్, సంతోష్ కుమార్ పాటిల్,జీ. సంతు,సాయిరాం షెట్కార్ తదితరులు ఉన్నారు.

# లిఫ్ట్ లో ఇరుక్కుని బాలుడు మృతి

(మెట్రో న్యూస్)రామచంద్రపురం:గుంటూరు జిల్లా సత్తెనపల్లి చెందిన వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులతో కలిసి గత ఫిబ్రవరిలో రాంచంద్రపురం పట్టణానికి వచ్చాడు. రామచంద్ర రెడ్డి నగర్ కాలనీ లోని మల్లారెడ్డి నివాసంలో వాచ్మెన్ గా పనిచేస్తున్నాడు. అతని నాలుగేళ్ల కుమారుడు గిరివర్ధన్ శుక్రవారం రాత్రి ఏడు గంట సమయంలో ఆడుకుంటూ లిఫ్టులోకి వెళ్లాడు. మొదటి అంతస్తులో లిఫ్ట్ వద్ద పెద్ద శబ్దం రావడంతో అందరూ లిఫ్ట్ వద్దకు వెళ్లి తలుపు తీసి చూడగా గిరివర్ధన్ లిఫ్టులు ఇరుక్కుని తీవ్ర గాయాలు పాలయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్ లో పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని పోలీసు తెలిపారు.సంఘటన స్థలాన్ని ఏసిపి శ్రీనివాస్ కుమార్ ,సిఐ జగన్నాథ్ , హైడ్రా రిస్క్ టీమ్ సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో ఈవినింగ్స్
METRO EVENINGS
ఆదిలాబాద్-నిజామాబాద్
మంచిర్యాల | కామారెడ్డి
ఆసిఫాబాద్
నిర్మల్
epaper.metroevenings.com
తేది : ఆదివారం మే 10 2026


# షార్ట్ సర్క్యూట్ బాధితులకు అండగా ఉంటా..





**-బాధితులను పరామర్శించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**

నిజామాబాద్, మే 9( మెట్రోన్యూస్ )షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయిన బీజేపీ నాయకురాలు మీరా వైచల్ కుటుంబానికి అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. శనివారం నగరంలోని అర్సపల్లి లో గల సంఘటన స్థలాన్ని పరిశీలించి, కుటుంబానికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీరా వైచల్ పిల్లల విద్యాభ్యాసానికి తన వంతు సహాయం ఉంటుందన్నారు. షార్ట్ సర్క్యూట్ తో సర్వం కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయం కూడా వీలైనంత తొందరగా అందేలా చూడాలని ఆర్డిఓ రాజేంద్రప్రసాద్ ను ఆదేశించారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ధన్ పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెలవారి నిత్యవసర సరుకులతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే తో పాటు కార్పొరేటర్ మఠం పవన్, బీజేపీ నాయకులు గడ్డం రాజు, పవన్ ముందడ, బంటు ప్రవీణ్, మేధరి శేఖర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక మండలి కౌన్సిలర్లకు కో ఆప్షన్ సభ్యులకు వీడ్కోలు పలికిన ఎమ్మెల్యే



మెట్రో న్యూస్ అచ్చంపేట (మే 9):అచ్చంపేట పురపాలక పాలకమండలి సభ్యుల పదవి కాలం బుధవారం తో ముగియడంతో శుక్రవారం సాయంత్రం కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు కో ఆప్షన్ నెంబర్ షమీం మహబూబ్ అలీ వీడుకోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సీల్డ్ ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతటితో మీరు అధికారికంగా ఈరోజుతో ముగింపు అయినప్పటికీ మీరే మళ్లీ పురపాలక ఎన్నికలు జరిగేంతవరకు మీ కాలని సమస్యలు ప్రజల మధ్యలో ఉండి ప్రజలకు ఏమి కావాలని, మీ కాలనీలో సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, ప్రజల మధ్యలో ఉండాలి అని మంచి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వారికి సూచించే ధన్యవాదాలు తెలిపారు. కచ్చితంగా ప్రజల మధ్యలో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని తన దృష్టికి, మరియు కమిషనర్ దృష్టికి తీసుక రావాలని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## పలు ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే





బాన్సువాడ మే 09 మెట్రో న్యూస్ బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో నూతనంగా నిర్మించిన పలు ఆలయాల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి, శ్రీ పోచారం సురేందర్ రెడ్డి. బాన్సువాడ గ్రామీణ మండలం సంగ్రామ్ తండా లో నూతనంగా నిర్మించిన ఆలయాలలో ఆధ్యాత్మిక గురువులు శ్రీ బాబు సింగ్ మహారాజ్ గారి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ జగదాంబ మాత - శ్రీ సేవలాల్ మహారాజ్ - శ్రీ రామ్ రావు మహారాజ్ గార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారుపోతంగల్ మండలం హంగర్గ ఫారంలో నూతనంగా నిర్మించిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారుబాన్సువాడ గ్రామీణ మండలం తిరుమలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారుఅనంతరం బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పలువురు ఆత్మీయుల వివాహాది శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏం ఆర్ పొట్టేల్ రెస్టారెంట్‌లి ను స్థానిక శాసన సభ్యులు శ్రీ ధన్ పాల్ సూర్యనారాయణ, నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు శ్రీ భూపతి రెడ్డి గార్లతో కలిసి రెస్టారెంట్ ను ప్రారంభించిన పోచారం. ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాన్యం, తన సమీప బంధువు శ్రీ మధుసూదన్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమాలలో బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


# చెరువు మట్టి తో రైతులకు అధిక దిగుబడులు



కారేపల్లి, మెట్రో ఈవివెనింగ్ మే 9:రైతులు ప్రధానంగా అధిక దిగుబడుల కోసం చెరువు మట్టి పంట పొలాల్లో వినియోగిస్తే భూమిలో పోషకాలు పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చు అని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం అప్పాయిగూడెం చెరువు నందు ఇరిగేషన్ శాఖ రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వమాట్లాడుతూ వ్యవసాయ భూములలో చెరువు మట్టిని వేసుకోవడం వల్ల పోషకాలు పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని వారు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ బి వెంకట్ నాయక్ ఇరిగేషన్ ఏఈ నాగయ్య అప్పారావు అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, ఏఈవో మున్ని రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్ కుమార్ మృతి





కల్వకుర్తి టౌన్:-మెట్రో న్యూస్ మే 9కల్వకుర్తి సమీపంలో జడ్చర్ల కోదాడ ప్రధాన జాతీయ రహదారిపై సీబీయం కాలేజీ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు ప్రైవేట్ స్కూల్ బస్సు ఎదురెదురుగా బలంగా ఢీకొన్న ఘటనలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ విజయ్ కుమార్ మృతి చెందాడు. తీవ్రగాయాలతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి డాక్టర్లు తీవ్ర ప్రయత్నం చేసినప్పటికి బ్రతికించలేక పోయారు. ప్రతి రోజులాగే ఉదయం అక్షరవణంలో ఇండోర్ షెటిల్ గేమ్ ఆడడానికి వెళ్ళి వచ్చే క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. కల్వకుర్తిలో మంచిపేరు సంపాదించిన గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్ కుమార్ అకాలమరణం చెందడంతో చాలా మంది గర్భిణీలు, పేషెంట్లు, ప్రముఖులు, స్నేహి తులు తన మృతి పట్ల విచారం వ్యక్త పరుస్తున్నారు. ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో ఐతే పనిచేస్తున్నాడో అదే ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టంకోసం తరలించడంతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అనురాధ తోటి వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది శోక సముద్రంలో మునిగిపోయారు.

# మహారాణా ప్రతాప్ విగ్రహ ఏర్పాటుకు కృషి

**-అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా**

నిజామాబాద్, మే 9( మెట్రోన్యూస్ )నగరంలో మహారాణా ప్రతాప్ సింగ్ విగ్రహ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు.. శనివారం మహారాణా ప్రతాప్ జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చరిత్రలో అత్యంత ధైర్యవంతుడైన రాజుల్లో మహారాణా ప్రతాప్ ఒకరన్నారు. స్వామిమాణం దేశభక్తి ధైర్య సాహసాలకు ఆయన ప్రత్యేకగా నిలిచారని కొనియాడారు. మొగల్ చక్రవర్తి అక్బర్ ఆధిపత్యానికి ఎదురుగా నిలిచి స్వాతంత్రం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని తెలిపారు. ప్రధానంగా హల్దీ గాటి యుద్ధం ఆయన వీరత్వానికి గుర్తుగా నిలిచిందన్నారు. ఆయన రాజ్యం కోల్పోయిన ఆత్మగౌరవాన్ని కోల్పోలేదన్నారు శత్రువులకు తలవంచకుండా అడవుల్లో కష్టాలు పడుతూ జీవించాలని గుర్తు చేశారు. నేటి



యువత మహారాణా ప్రతాప్ సింగ్ జీవిత నాదశంగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొందిల రజక సంఘం అధ్యక్షుడు బొందిల బలరాం సింగ్, కార్యదర్శి నరేష్ సింగ్, కోశాధికారి మహేందర్ సింగ్, ఉపాధ్యక్షుడు తులసిరాం, విజయ్ సింగ్, రమేష్ సింగ్, లఖన్ సింగ్, బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, నాయకులు పవన్ ముందడ, గోసేవ ప్రతినిధి ధాత్రిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ధర్నాకు మద్దతుగా నిలిచిన మాజీ మంత్రి

**ప్రభుత్వం వెంటనే మక్కలు కోనుగోలు చేయాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రి**

మెట్రో న్యూస్ (జడ్చర్లటౌన్ ), మే 9జడ్చర్ల పట్టణంలోని పత్తి మార్కెట్ ఎదుట రోడ్డు పై బైఠాయించి రైతులు చేపట్టిన ధర్నా చేపట్టారు. జడ్చర్ల పర్యటనలో భాగంగా జడ్చర్ల విచ్చేసిన మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి శని వారం రైతుల ధర్నా లో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి, జడ్చర్ల ఎంఆర్ఓ నర్సింగ్ రావు, రూరల్ సిఐ మహేష్, ఎస్సై లు మల్లేష్, జయ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అల్వాల్ రెడ్డి రైతుల ధర్నా కార్యక్రమం వద్దకు చేరుకుని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అక్కడే మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి ఎంఆర్ఓ నర్సింగ్ రావు, వ్యవసాయ అధికారి తో మాట్లాడారు నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో ఏంటని ప్రశ్నించారు. గోదాం లు స్టాక్ పాయింట్లు నిండిపోయాయి అని పేర్కొన్నారు.. ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్ యార్డ్ లో



దిగుమతి చేసుకోవాలని మాజీ మంత్రి తో రైతులు పట్టుబట్టారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కారం చేయాలని పేర్కొన్నారు... దన్యం దిగుమతి చేయడానికి స్థలం లేదు అని చేప్పడంతో కాసేపు మార్కెట్ చైర్మన్ భర్త అల్వాల్ రెడ్డి కి రైతులకు వాగ్వాదం జరిగింది. దీంతో రంగంలోకి దిగిన మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి రైతులు ధాన్యం ను ఉన్న ఖాళీ స్థలంలో దిగుమతి చేయాలని కోరారు. మాజీ మంత్రి మార్కెట్ యార్డు లో ధాన్యాలు దిగుమతి చేయాలని పట్టుబట్టారు దీంతో ఉన్న స్థలం లో దిగుమతి చేసుకునేందుకు అధికారులు ఒప్పుకోవడంతో రైతులను మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి నచ్చజెప్పి ధాన్యాలు దిగుమతి చేపట్టారు.. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యాలు కోనుగోలు చేయకపోవడంతో రైతులు గోస పడుతున్నారని మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి మండిపడ్డారు... ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లో విఫలమైందని అన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి ధాన్యాలు కోనుగోలు చేపట్టాలని సూచించారు...లేని యెడల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి అన్నారు...

# మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- ఆనాటి ఇందిరమ్మ ఆలోచన నేడు తెలంగాణలో సరికొత్తచరిత్ర
- రుణపరిమితి రూ.10లక్షలకు పెంచటంపై మహిళాసంఘాల కృతజ్ఞతలు
- ఎమ్మెల్యేను సన్మానించిన ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, మహిళాసంఘాలు



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచడం పట్ల మహిళ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ, నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, మహిళాసంఘాల ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించి, ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాల క్రితం మహిళా సాధికారత కోసం ఇందిరాగాంధీ వేసిన బీజం వేసింది. నేడు తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ మహావృక్షంగా మారుతోందని అన్నారు. గతంలో మహిళా సంఘాలకు 5లక్షల రుణపరిమితితో కేవలం చిన్నపాటి పొదుపుకే పరిమితం కాగా, దానిని ప్రస్తుతం రెట్టింపు చేయటం మహిళలను ఆర్థికంగా తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు తోడ్పడుతుందని తెలిపారు. గ్రామీణ మహిళల కళ్లలో వెలుగు చూసేందుకు ఆనాడు ఇందిరాగాంధీ మదిలో పుట్టిన డ్వాక్రా వ్యవస్థ తర్వాత పీవీ బలోపేతం చేశారు.

రేవంత్ రెడ్డి హ యాంలో నేడు తెలంగాణ గడ్డపై సరికొత్త చరిత్రను లిఖిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం అంకెల గారడీ కాదని, ఆత్మ గౌరవం, ఆర్థిక స్వేచ్ఛకు అసలైన హామీగా అభివర్ణించారు. ఈ అవ కాశాన్ని మహిళలంతా సద్వినియోగం తెలిపారు. ప్రతి ఒక్కరు రైజింగ్ తెలంగాణలో భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే మహిళా సంఘాలకు సూచించారు.

## రేడియల్ రింగ్ రోడ్‌ను వ్యతిరేకిస్తూ తహసిల్దార్‌కు రైతుల వినతి



**పరిగి (మెట్రో న్యూస్) :** దోమ మండలం పాలేపల్లి గ్రామంలో ప్రతిపాదిత రేడియల్ రింగ్ రోడ్ విస్తరణపై తహసిల్దార్ గోవిందమ్మ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూతహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్ నుండి షాబాద్ మీదుగా లగచర్ల రీజినల్ రింగ్ రోడ్ పరిధి వరకు నిర్మించనున్న ఈ రేడియల్ రోడ్ వల్ల వందల ఎకరాల సాగుభూములు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పాలేపల్లి గ్రామ పరిధిలో పంట భూములు, బోర్లు, చెట్లు, వ్యవసాయ ఆధారిత జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని తెలిపారు. తరతరాలుగా సాగుచేస్తున్న భూములను రహదారి పేరిట తీసుకోవడం అన్యాయమని, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు. సరైన నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండా భూసేకరణ చేపట్టవద్దని రైతులు స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మార్వో గోవిందమ్మ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## రాయపోల్లో ప్రైవేట్ పొదుపు సంఘాల బాగోతాలు

### మహిళల వద్ద నెల నెల వేళల్లో డబ్బులు వసూళ్లు.... ఒక్క పైసా తిరిగివని ప్రైవేట్ పాలు సంఘం యజమాన్యం రాయపోల్లో పొదుపు సంఘం వద్ద పెద్ద ఎత్తున మహిళల ఆందోళన





**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** మండలంలోని రాయపోల్ సేవా మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు (పరిమిత)సంఘంలో అవకతవకలు జరిగాయని గ్రామంలోని మహిళలు,గ్రామ పెద్దలు శనివారం సంఘం వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మహిళలతో పొదుపు డబ్బులు క్రమం తప్పకుండా కట్టించుకుంటూన్నారని, అయితే కొత్త రుణాలు మాత్రం ఇవ్వడం లేదని మేనేజర్ ఓం ప్రకాష్ పై మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తూ సంఘానికి తాళాలు వేశారు. గత 30 ఏండ్లుగా రాయపోల్ గ్రామంలో ఈ పొదుపు సంఘం నడుస్తుందని అందులో దాదాపు 2000కు పైగా మహిళలు ప్రతినెల డబ్బులను పొదుపు చేస్తూ ఆ డబ్బును తమ అవసరాలకు రుణాలు ఇవ్వడం జరుగుతుంది.మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం ప్రధాన కార్యాలయం రద్దు చేయబడింది.అయినా గానీ రాయపోల్ మేనేజర్ ఓం ప్రకాష్ మాత్రం గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంస్థను రాయపోల్‌తో సహా ఇతర గ్రామాలలో నడిపిస్తున్నారు. బాదితురాలు జయమ్మ మాట్లాడుతూ... నేను గత 30 ఏండ్లుగా పొదుపు సంఘంలో పొదుపు డబ్బులు జమ చేస్తూ లోన్ తీసుకొని కట్టడం జరుగుతుందని, గత 8 నెలల క్రితం తన లోన్ ను మొత్తం కట్టి మళ్లీ కొత్తగా లోన్ అడగగా 6 నెలల నుంచి తమకు లోన్ ఇవ్వడం లేదని, ఎందుకు ఇవ్వడంలేదని అడగగా లోన్ తీసుకున్న వారు డబ్బులు ఇవ్వడం లేదని, ఇంకా వేరే ఏవో కథలు చెప్తూ దాటావేస్తున్నాడని, డబ్బులు మాత్రం కట్టించుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలనెలా డబ్బులు కట్టించుకుంటూ ఒక్క నయా పైసా తిరిగి ఇవ్వడం లేదని,ఇలా నాతో పాటు చాలామందికి లోన్లు ఇవ్వకుండా అవకతవకలు చేస్తున్నారని మాకు వెంటనేమాముజమ చేసిన పైసలైన ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## దేశాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుంది

### - బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నిట్టు శ్రీశైలం



**మెట్రో న్యూస్, ఇబ్రహీంపట్నం:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు విచ్చేయనున్న సందర్భంగా మే 10వ తేదీన ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించబడనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుని శనివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ డివిజన్ పరిధిలో విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సంజీవని వనం పార్క్ ఇంజాపురం, మునగనూరుప్రాంతాలలో వాకర్స్ సభ్యులకు,స్థానిక ప్రజలకు సభ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశారు. పేదల బతుకుల్లో వెలుగులు నింపి భారత దేశాన్ని, ప్రపంచానికే ఓ దిక్సూచిలా నిలుపుతూ, దేశాన్ని అభివృద్ధి చేసిన అభివృద్ధి ప్రదాత భారత ప్రధాని మోడీ సభను తమ వంతుగా ప్రజలందరూ పాల్గొని సికింద్రాబాద్ ప్రధాని మోడీ సభను విజయవంతం చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నిట్టు శ్రీశైలం కోరారు.ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి, బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్,రాష్ట్ర దళిత మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కొండ్రు పురుషోత్తం, రంగారెడ్డి దళిత మోర్చా మాజీ అధ్యక్షులు బచ్చగాళ్ళ రమేష్, బిజెపి జిల్లా మాజీ కోశాధికారి మాజీ కొత్త రామ్ రెడ్డి, గుండె కృష్ణ కురుమ, నందగిరి సురేష్ గౌడ్, నాగరాజు, పాల్గొన్నారు.

## మోదీ సభ విజయవంతానికి ప్రతి ఒక్కరు తరలిరావాలి

### - ప్రతి గ్రామం నుంచి భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపు



**చేవెళ్ల,మే 09 ( మెట్రో న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పిలుపునిచ్చారు. శనివారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశాభివృద్ధికి మోదీ నాయకత్వం బలమైన దిశానిర్దేశం చేస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే భారతీయ జనతా పార్టీకి ప్రజాదరణను తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. భారీ జనసమీకరణ ద్వారా మోదీ సందేశాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అత్తెలి అనంత్ రెడ్డి, డాక్టర్ వైభవ్ రెడ్డి, సామ మాణిక్య రెడ్డి, కేశపల్లి వెంకట్ రాంరెడ్డి, పత్తి సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, సామ కృష్ణారెడ్డి, విట్టల్ రెడ్డి, అభిషేకర్ రెడ్డి, అశోక్, శ్రీకాంత్ రెడ్డి, గణేష్, పురుషోత్తం రెడ్డి, అభిలాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

### - నూతన కార్యాలయాల భవనం లు, ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ళ మే 09( మెట్రో న్యూస్):** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాదనతనిస్తుందని శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలం పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. షాబాద్ మండలం పెద్దవీడు, గ్రామంలో రూ.10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన డ్వాక్రా భవనాన్ని, 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.5 లక్షల నిధులతో స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావాలి చంద్రశేఖర్, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, గుండాల అశోక్, రాజసులోచన, శ్రీశైలం యాదవ్, లావణ్య చెన్నయ్య, స్వరూప మహేందర్ గౌడ్ ,సబితా గోవర్ధన్ రెడ్డి ,సవిత సుభాష్ ,శాంతమ్మ యాదయ్య ,నవనీత స్వామి ,నర్సింలు ,సందీప్ గౌడ్, నాయకులు వెంకట్ రెడ్డి ,రాహుల్,కిషోర్ ,సంజీవ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి ,సుభాష్ రెడ్డి ,శ్రీనివాస్ ,జంగయ్య ,శేఖర్ ,భరత్ ,రఫీక్, రవీందర్ ,దేవేందర్ రెడ్డి ,పార్టీ కార్యకర్తలు , సంబంధిత అధికారులు పాలుగోన్నారు..

## పేదింటి ఆడపిల్లల వివాహాలకు అండగా ఉప్పల ఫౌండేషన్

### - ఉప్పల శ్రీనివాస్ స్వప్న గుప్త



**మెట్రో న్యూస్, నాగోల్:** నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న చేతుల మీదుగా ముగ్గురు పేదింటి ఆడపిల్లల వివాహాల కోసం వారి కుటుంబాలకు పూస్తే మట్టెలు, చీరలు, గాజులు అందజేశారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త స్వప్న మాట్లాడుతూ.. ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే పేదింటి ఆడపిల్లల వివాహాలకు అండగా నిలుస్తూ పూస్తే మట్టెలు, చీరలు అందజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నర్సిరెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు నారాయణ, దైవదినం, భద్రాద్రి టెంపుల్ డైరెక్టర్ వీరన్న, నరేష్ గుప్త, ప్రవీణ్ గుప్త, శ్రీధర్ గుప్త, పలువురు నేతలు, ఐవీఎఫ్ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సూదిని రాంరెడ్డికి అభినందనల వెల్లువ



**మాడ్గుల మే 09 ( మెట్రో న్యూస్):** మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ దళపతి గౌడ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు నూతనంగా నియమించబడిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ గా మాడ్గుల మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు,మాజీ ఎంపీపీ సూదిని రామ్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు నూతనంగా నియమించబడిన పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూదిని రామిరెడ్డి మన ప్రాంతంలోని గ్రామపంచాయతీలకు అత్యధికంగా నిధులు మంజూరు చేయించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎప్పటికప్పుడు సమస్యలను విన్నవించి అత్యధిక నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని నూతనంగా నియమించబడిన పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ ను కోరినట్లు కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు,ఇర్విన్ ఉపసర్పంచ్ దళపతి గౌడ్ చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్, పగడాల వెంకటేష్, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం, కారు ఢీ

### - ఒకరు మృతి మరొకరికి గాయాలు

**మాడ్గుల మే 09 ( మెట్రో న్యూస్):** ద్విచక్ర వాహనం - కారు ఢీకొని ఒకరు మృతి మరొకరికి గాయాలైన ఘటన మాడ్గుల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.మాడ్గుల సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ తెలి పిన వివరాల మేరకు మాల్ గ్రామానికి చెందిన సూలు యాలాద్రి(42), చింతల రంగయ్య (52) వీరిద్దరూ టీవీఎస్ జూపిటర్ స్కూటర్ టీఎస్ 05 ఎఫ్ డి 7628 పై నల్గొండ జిల్లా చింతపల్లి మండ లంలోని కురుమ పల్లి గ్రా మం నుండి మాల్ వైపు వెళ్తుండగా కొల్కు లపల్లి సమీపంలోని సాగర్ హైవే రైస్ మిల్లు సమీపంలో వెనుక నుండి హ్యుందాయ్ వెర్నా కారు టీఎస్ 08 ఈఈ 2809 వెనుక నుండి ఢీకొట్టగా ఇద్దరికీ గాయాలైనట్లు సీఐ చెప్పారు. వారిద్దరిని చికిత్స నిమిత్తం మాల్ గ్రామంలోని లైఫ్ స్టార్ వైద్యశాలకు తరలిం చారు. సూలు యాలాద్రి పరిస్థితి విసమిం చడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో ఓఆర్ఆర్ బొంగులూరు సమీపంలో యాలాద్రి మృతి చెందిన ట్లు సిఐ వివరించారు.ఇట్టి ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వేణుగోపాల్ తెలిపారు.

## రేపటి నుంచి జూన్ 9 వరకు ఇండ్ల గణన సర్వే

**పాలేరు మే 09( మెట్రో న్యూస్):** మండలం లో 11 నుంచి ఇండ్ల, గణన సర్వే చేపట్టనున్నట్లు నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ తెలిపారు. మండల తహశీల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం ను మొత్తం 93 బ్లాక్ లు గా విభజించినట్లు తెలిపారు. ఇంటింటి సర్వే చేయనున్నట్లు తెలిపారు. 91 మంది ఎన్యూమరేటర్స్, 16 మంది సూపర్వైజర్స్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 11 నుంచి జూన్ 9 వరకు ఈ సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. సర్వే సమయంలో ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. ఇండ్ల వివరాలు సేకరించి ప్రభుత్వం కు సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. సర్వే ఖచ్చితంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో నేలకొండపల్లి ఎంపీడీఓ యం. యర్రయ్య, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్స్ ఆలస్యం మధుసూధన్రావు, అల్లం రవికుమార్ లు ఉన్నారు.

## రాజమహేంద్రవరంలో నూతన 10 కోర్టు భవన సముదాయాలు ప్రారంభం

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం శిలాఫలక ఆవిష్కరణతో




ప్రారంభమైన కార్యక్రమం గార్డ్ ఆఫ్ ఆనర్, పూర్ణకుంభ స్వాగతంతో న్యాయమూర్తులకు ఘన స్వాగతం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్. రఘునందన్ రావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్ పాల్గొన్నారు నూతన కోర్టు హాళ్లు, ఆధునిక సదుపాయాలను పరిశీలించిన న్యాయమూర్తులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం స్వాగత ప్రసంగం నూతన భవన నిర్మాణ విశేషాలు వివరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ వి ప్రసాద్ అభినందనలు న్యాయ వ్యవస్థలో ఆధునిక మౌలిక వసతుల ప్రాముఖ్యతపై న్యాయమూర్తుల ప్రసంగం ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో కోర్టు సదుపాయాల అవసరంపై దృష్టి నూతన కోర్టు భవన నిర్మాణంపై ప్రత్యేక వీడియో ప్రదర్శన




## విశాఖలో 102 కి.మీ. మేర సెమీ రింగురోడ్డు

### మంత్రి నారాయణ

విశాఖపట్నం: రానున్న 50 ఏళ్లలో విశాఖ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. వీఎంఆర్డీఏ మా స్టన్పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.

నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్న్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి అందిన వినతుల్లో 90 శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుంది॥ అని మంత్రి నారాయణ వివరించారు. మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్గా మారుతోందన్నారు.

## అర్ధరాత్రి వేళ ఒంగోలులో భూప్రకంపనలు



ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1:45 గంటల సమయంలో స్వల్పంగా భూమి కంపించింది. ఈ హఠాత్ పరిణామంతో గాఢ నిద్రలో ఉన్న ప్రజలు భయంతో వణికిపోయారు. కేవలం రెండు సెకన్ల పాటు భూ ప్రకంపనలు రావడంతో ఏం జరుగుతుందో అర్థం కాక జనం అయోమయానికి గురయ్యారు.

శ్రీరామపురం కాలనీతో పాటు సీఎస్ఆర్ శర్మ కాలేజీ ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు చెబుతున్నారు. పెద్ద శబ్దం రావడంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీసి రోడ్లపైనే గడిపారు. అపార్ట్మెంట్లలో నివసించే వారు తీవ్ర ఆందోళనకు లోనై మెట్ల ద్వారా కిందికి వచ్చారు. దాదాపు గంట పాటు బయటే ఉండి పరిస్థితిని గమనించిన తర్వాత మళ్లీ ఇళ్లలోకి వెళ్లారు.

ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న జిల్లా ఈ భూకంపం తీవ్రత చాలా తక్కువగా ఉండటంతో ఎటువంటి ఆస్తి నష్టం లేదా ప్రాణ నష్టం జరగలేదు. అధికారులు సైతం ఇది స్వల్ప ప్రకంపనలే అని నిర్ధారించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా గోడలు కూలడం వంటి ఘటనలు చోటు చేసుకోలేదు. ప్రస్తుతం పరిస్థితి అంతా ప్రశాంతంగా ఉందని యంత్రాంగం వెల్లడించింది.



## సీఎం సువేందు అధికారికి శుభాకాంక్షలు

### తెలిపిన పవన్ కల్యాణ్

బెంగాల్లో బీజేపీ సాధించిన విజయాన్ని పవన్ కల్యాణ్ భారత ప్రజల విజయంగా అభివర్ణించారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మించిన ఈ పవిత్ర గడ్డపై, దశాబ్దాల పోరాటం తర్వాత బీజేపీ అధికారంలోకి రావడం ఆయన ఆశయాలకు దక్కిన నిజమైన నివాళి అని కొనియాడారు. కార్యకర్తల నిరంతర కృషి, త్యాగాల వల్లే ఈ అద్భుత ఫలితం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

జాతీయ భద్రత, అక్రమ వలసలపై ఆశలు సరిహద్దు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై పవన్ కల్యాణ్ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా బెంగాల్లో అక్రమ వలసలు, తీవ్రవాద చొరబాట్లు జాతీయ భద్రతకు సవాల్గా మారాయని ఆయన అభిప్రాయపడ్డారు. సువేందు అధికారి నాయకత్వంలోని నూతన ప్రభుత్వం ఈ సమస్యలను అణచివేస్తుందని, సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో హింస, అరాచకాలకు తావులేకుండా పారదర్శకమైన మరియు ప్రజాస్వామ్యబద్ధమైన పాలన సాగాలని పవన్ ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై బెంగాల్ ప్రజలకున్న అచంచలమైన నమ్మకమే ఈ విజయానికి పునాది అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా, పార్టీ నేతలు నితిన్ నబిన్, సమిక్ భట్టాచార్యలకు పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

## దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి లోకేశ్





ఇంద్రకీలాద్రి(విజయవాడ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మంత్రి నారా లోకేశ్ దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేశ్కు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు మంత్రికి వేదాశీర్వచనం చేయగా.. అధికారులు శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మహామండపం మొదటి అంతస్తులో జరిగిన ఓ ప్రైవేటు వేడుకకు మంత్రి హాజరయ్యారు. అక్కడ నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట దుర్గగుడి పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉన్నారు.

## సహకార శాఖలో పారదర్శకంగా ప్రమోషన్లు, పోస్టింగులు



ఉద్యోగులకు సమయానికి పదోన్నతులుని- వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది వ్యవసాయ,సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అమరావతి, మే 9: సహకార శాఖలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 100 మంది వివిధ కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా, ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజు నేతృత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, పదోన్నతులు పొందిన ఉద్యోగులు విజయవాడలో వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు పదోన్నతులు త్వరితగతిన మంజూరు చేయడమే కాకుండా, పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగ్ ఆర్డర్లు జారీ చేసినందుకు ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపింది. ప్రమోషన్లు పొందిన ఉద్యోగుల అభ్యర్థన మేరకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేక్ కట్ చేసి ఉద్యోగులతో ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడమే కాకుండా, అవినీతికి ఆస్కారం లేకుండా పూర్తిస్థాయి పారదర్శకతతో పోస్టింగులు ఇవ్వడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



## మరో ప్రైవేటు బస్సు బోల్తా

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం సింగనపల్లి వద్ద శనివారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఘటన వివరాలు స్థానికులు వెంటనే స్పందించి బస్సు అద్దాలు పగులగొట్టి ప్రయాణికులను బయటకు తీశారు. గాయపడిన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రమాదానికి అతివేగమే కారణమా లేక సాంకేతిక లోపమా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారు, బస్సు ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్తోంది అనే పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## మత్స్యకారులకు CM చంద్రబాబు శుభవార్త

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకార కుటుంబాలకు పెద్ద పీట వేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సముద్రంలో వేట విరామ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రభుత్వం 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని



అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఈ నెల 19వ తేదీన మొత్తం రూ. 286 కోట్ల నిధులను ముఖ్యమంత్రి పంపిణీ చేయనున్నారు. అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబం ఖాతాలో రూ. 20,000 చొప్పున ప్రభుత్వం నగదును జమ చేయనుంది. గత ఏడాది సుమారు 1.30 లక్షల కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందగా, ఈసారి కూడా అంతే స్థాయిలో లబ్ధిదారులకు మేలు చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సముద్ర సంపదను కాపాడటంతో పాటు చేపల పునరుత్పత్తికి ఆటంకం కలగకుండా ఉండేందుకు ఏటా ప్రభుత్వం వేట విరామ సమయాన్ని అమలు చేస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు అంటే మొత్తం 61 రోజుల పాటు సముద్రంలో వేటపై నిషేధం కొనసాగనుంది. ఈ సమయంలో యాంత్రిక, మోటారు పడవలతో వేట సాగించడం చట్టరీత్యా నేరం. సముద్రంలోని చేపలు గుడ్లు పెట్టి సంఖ్యను పెంచుకునేందుకు ఈ విరామం ఎంతో అవసరం. అయితే ఈ రెండు నెలల పాటు పనులు లేక మత్స్యకారులు ఇబ్బంది పడకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది.

మత్స్యకార సంక్షేమానికి ప్రభుత్వ భరోసా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. కేవలం ఆర్థిక సాయమే కాకుండా, మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, జెట్టీల నిర్మాణం మరియు డీజిల్ సబ్సిడీ వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. వేట నిషేధ సమయంలో ఇచ్చే ఈ రూ. 20 వేల నగదు సాయం, ఆయా కుటుంబాల నిత్యావసరాలకు మరియు ఇతర ఖర్చులకు ఎంతో తోడ్పడనుంది. ఈ నెల 19న జరిగే కార్యక్రమంలో బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి ఈ నిధులను బదిలీ చేయడం ద్వారా పారదర్శకతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.



## ఆగస్టు నెల శ్రీ వారి ఆర్జిత సేవా టికెట్ల కోటా 18న విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆగస్టు నెల కోటాను తితిదే ఈ నెల 18న ఉదయం 10 గంటలకు ఆన్లైన్లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. లాటరీలో ఎంపికైన భక్తులు ఈ నెల 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నంలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి.

21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు విడుదలవుతుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం కోటా, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన కోటా అందుబాటులో ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన కోటా విడుదలవుతుంది. 25న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.300 టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు అద్దె గదుల బుకింగ్ కోటా విడుదల చేస్తారు. https://ttdevasthanams, ap. gov. in.

# యశస్వి జైస్వాల్‌పై రెండేళ్ల నిషేధం?



టీమిండియా భవిష్యత్తు స్టార్లుగా వెలుగొందుతున్న యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలు ఇప్పుడు అనూహ్యమైన చిక్కుల్లో పడ్డారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ వీరిద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయడం క్రీడా వర్గాల్లో పెను సంచలనంగా మారింది. డోపింగ్ పరీక్షల కోసం తమ ఆచూకీ తెలపడంలో విఫలమవ్వడం, అలాగే అధికారులు పరీక్షల కోసం వెళ్లినప్పుడు అందుబాటులో లేకపోవడంతో నాడా ఈ చర్యలు తీసుకుంది. ప్రస్తుతం యశస్వి జైస్వాల్ ఐపీఎల్‌లో బిజీగా ఉండగా.. షఫాలీ వర్మ ప్రపంచకప్ విజయానంతరం విరామంలో ఉంది.

ఏమిటీ వేర్ అబౌట్స్ గండం? అంతర్జాతీయ క్రీడా నిబంధనల ప్రకారం.. రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్‌లో ఉన్న ప్రతి అథ్లెట్ తమ రోజువారీ షెడ్యూల్‌ను నాడా యాప్‌లో అప్‌డేట్ చేయాలి. దీనిని వేర్ అబౌట్స్ అంటారు. అంటే అధికారులు నోటీసు ఇవ్వకుండా ఏ సమయంలోనైనా వచ్చి డోపింగ్ శాంపిల్స్ సేకరించే అధికారం కలిగి ఉంటారు. యశస్వి జైస్వాల్, షఫాలీ వర్మలు తాము రిజిస్టర్ చేసిన ప్రదేశాల్లో అధికారులు తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడ లేకపోవడంతో దీనిని నిబంధనల ఉల్లంఘనగా నాడా పరిగణించింది.

రెండేళ్ల నిషేధం ముప్పు పొంచి ఉందా? క్రీడాకారులకు ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. వేర్ అబౌట్స్ ఫెయిల్యూర్ చట్టం ప్రకారం.. 12 నెలల వ్యవధిలో మూడుసార్లు ఇలా పరీక్షలకు గైర్హాజరైతే.. అది డోపింగ్ టెస్టులో ఫెయిల్ అయిన దానితో సమానంగా పరిగణించబడుతుంది. ఒకవేళ వీరు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోతే.. విచారణ అనంతరం వీరిద్దరిపై గరిష్ఠంగా రెండేళ్ల వరకు నిషేధం విధించే అవకాశం ఉంది. అదే జరిగితే వీరి కెరీర్ తీవ్రమైన సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది.

భారత్ క్రికెట్‌పై ప్రభావం ఈ నోటీసులు కేవలం ఆ ఇద్దరు ఆటగాళ్లకే కాదు, మొత్తం భారత క్రికెట్‌కే పెద్ద ఆందోళనగా మారాయి. యశస్వి జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక ఆటగాడు మాత్రమే కాదు.. టీమిండియా ఓపెనింగ్ విభాగంలో విశ్వసనీయమైన ప్లేయర్. అలాగే షఫాలీ వర్మ మహిళా క్రికెట్‌లో విధ్వంసకర బ్యాటర్. వీరిద్దరూ లేకపోవడం అంటే జట్టు బలహీనపడటమే. ముఖ్యంగా ఐపీఎల్ కీలక దశలో ఉండగా యశస్వి జైస్వాల్‌కు ఇటువంటి నోటీసులు రావడం రాజస్థాన్ యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది.

తదుపరి పరిణామాలు ఏమిటి ప్రస్తుతానికి నాడా వీరికి వివరణ ఇచ్చుకోవడానికి కొంత సమయం ఇచ్చింది. తమ ప్రయాణాలు లేదా అత్యవసర కారణాల వల్ల పరీక్షలకు అందుబాటులో లేమని నిరూపించుకోగలిగితే వీరు ఊపిరి పీల్చుకోవచ్చు. లేని పక్షంలో డోపింగ్ విచారణ కమిటీ ముందు హాజరుకావాల్సి ఉంటుంది. బీసీసీఐ ఈ విషయంలో క్రీడాకారులకు ఎలా మద్దతుగా నిలుస్తుంది, ఈ యువ ఆటగాళ్లు తమ కెరీర్‌ను ఎలా కాపాడుకుంటారు అనేది ఇప్పుడు క్రికెట్ అభిమానులందరిలో ఉత్కంఠ నెలకొంది.

# ఫిన్ అలెన్ ఊచకోత.. ఢిల్లీపై కేకేఆర్ ఘన విజయం!

ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) తమ జోరును కొనసాగిస్తోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ చేరాలంటే ప్రతీ మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉండటంతో కేకేఆర్ అసాధారణ ప్రదర్శనతో జైత్రయాత్రను కొనసాగిస్తోంది. ఢిల్లీ వేదికగా శుక్రవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ఫిన్ అలెన్ విధ్వంసకర శతకంతో కేకేఆర్ 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది.

ముందుగా బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఢిల్లీని కట్టడి చేయగా.. అనంతరం ఫిన్ అలెన్ అజేయ శతకంతో విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ గెలుపుతో కేకేఆర్ తమ ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపు తప్పుకుంది. అద్భుతం జరిగితే తప్పా ఆ జట్టు టోర్నీలో ముందడుగు వేయలేని పరిస్థితిని తెచ్చుకుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 పరుగులే చేసింది. పాతుమ్ నిస్సంక(29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50), అషుతోష్ శర్మ(28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 39) టాప్ స్కోరర్లుగా నిలిచారు. కేకేఆర్ బౌలర్లలో అనుకుల్ రాయ్, కార్తీక్ త్యాగి రెండేసి వికెట్లు తీయగా.. వైభవ్ అరోరా, సునీల్ నరైన్, కామెరూన్ గ్రీన్ తలో వికెట్ పడగొట్టారు.

అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 14.2 ఓవర్లలో 2 వికెట్లకు 147 పరుగులు చేసి 34 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కైవసం చేసుకుంది. ఫిన్ అలెన్(47 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో సత్తా చాటగా.. కామెరూన్ గ్రీన్(27 బంతుల్లో 2 సిక్స్‌లతో 33 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్‌కు మాత్రమే ఒక వికెట్ దక్కింది. ఫిన్ అలెన్ విన్నింగ్ షాట్‌గా సిక్సర్ బాదడంతో పాటు సెంచరీ మార్క్ అందుకున్నాడు. 10 సిక్సర్లతో ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోసాడు. ఈ మ్యాచ్‌లో పేలవ బ్యాటింగ్ ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించింది. ముఖ్యంగా మిడిలార్డ్ వైఫల్యం కోలుకోలేని దెబ్బతీసింది.




# సచిన్‌లానే కోహ్లీ తప్పును ఒప్పుకోడు సంజయ్ మంజ్రేకర్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గురించి మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ తరహాలోనే విరాట్ కోహ్లీ కూడా తన తప్పిదాన్ని అంగీకరించడని తెలిపాడు. సాకులు వెతికే ప్రయత్నం చేస్తాడని అభిప్రాయపడ్డాడు.

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గురువారం లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీని ప్రిన్స్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. పిన్స్ యాదవ్ వేసిన గుడ్ లెంగ్త్ డెలివరీని అంచనా వేయడంలో కోహ్లీ విఫలమయ్యాడు. 9 ఏళ్ల తర్వాత ఐపీఎల్‌లో ఛేజింగ్‌లో డకౌటయ్యాడు. క్లీన్ బౌల్డ్ అయిన అనంతరం పిచ్ వైపు చూస్తూ.. తన తప్పిదం ఏం లేదన్నట్లు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు.

కోహ్లీ రియాక్షన్‌పై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించిన సంజయ్ మంజ్రేకర్.. సచిన్ వ్యవహారం కూడా ఇలానే ఉండేదని గుర్తు చేసుకున్నాడు. ఁప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీ క్లీన్ బౌల్డ్ అయిన తీరును గమనిస్తే.. ఒక ఛాంపియన్ బ్యాటర్ మనస్తత్వం ఎలా ఉంటుందో మనకు అర్థమవుతోంది. గతంలో సచిన్ టెండూల్కర్ కూడా ఇలానే ప్రవర్తించేవాడు.




విరాట్ కోహ్లీ ఔటైన తీరు గురించి నేను చెప్పడం లేదు. విరాట్ ఔట్ అయిన తర్వాత అతని రియాక్షన్‌ను ఒకసారి గమనించండి. అతను ఔట్ అయిన వెంటనే.. పిచ్ వైపు ఏదో ఊహించనిది జరిగినట్లుగా ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు. పిచ్ అనూహ్యంగా స్పందించడం వల్లే తాను ఔటయ్యాననే భావనలో అలా చేశాడు.

అది గొప్ప బ్యాటర్ల లక్షణం.. సచిన్ టెండూల్కర్ కూడా తన కెరీర్ చివరి దశలో ఔటైనప్పుడు ఇలానే పిచ్‌వైపు చూసేవాడు. బంతి తక్కువ ఎత్తులో వచ్చిందని, పిచ్‌లో ఏదో తప్పు జరిగిందని మాస్టర్ సచిన్ భావించేవాడు. అయితే దిగ్గజ ఆటగాళ్లు ఎప్పుడు తమ తప్పిదాన్ని అంగీకరించరు. తమ తప్పిదాన్ని ఒప్పుకోకుండా సాకుల కోసం వెతుకుతారు. ఇది గొప్ప బ్యాటర్ల లక్షణం. ఎందుకంటే వారు సంవత్సరాలుగా అద్భుతమైన విజయాలను సాధించి ఉంటారు. వారి ఆత్మవిశ్వాసం చాలా ఎక్కువగా ఉంటుంది.

# మార్కెట్లోకి మిల్లెట్ బియ్యం

జొన్నల పిజ్జా.. కొర్రల బర్గర్.. రాగి పాస్తా.. సామల నూడుల్స్.. ఒరిగెల పులావ్.. వంటకాల పేర్లు వింటేనే నోరూరుతుందా..! చిరుధాన్యాలతోనూ ఇవి



చేసుకోవచ్చా.. అని ఆశ్చర్యంగా ఉందా..? అవే కాదు, వందకుపైగా రుచికరమైన వంటకాలు మిల్లెట్స్‌తో వండుకోవచ్చని చెబుతున్నారు భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్) శాస్త్రవేత్తలు. ఐదు రకాల చిరుధాన్యాలతో తయారైన బియ్యాన్ని త్వరలో మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు అదే సంస్థలోని న్యూట్రీహబ్ సీఈఓ డా. జె. స్టాన్లీ తెలిపారు. ఆధునిక జీవనశైలితో మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్లు వంటి దీర్ఘకాలిక జబ్బుల తాకిడి ఎక్కువవుతోంది.

ఈ పరిస్థితుల్లో మనం ఏం తినాలి? ఎలా తినాలి? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరి మదిలో వందల సార్లు మెదలకమానవు. అందుకు సమాధానంగా "బామ్మలు, తాతలు పాటించిన ఆహార పద్ధతులను ఆశ్రయించడమే" ఉత్తమం అని జాతీయ పోషకాహార సంస్థ మొదలు ఎంతో మంది వైద్యులు సైతం సూచిస్తున్నారు. వారానికి కనీసం 3 నుంచి 4 సార్లు చిరుధాన్యాలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అధ్యయనంలో పేర్కొంది. మధుమేహం, ఊబకాయం నియంత్రణకు చిరుధాన్యాలు సత్ఫలితాలిస్తున్నట్లు వెల్లడించింది. కొర్రలు, రాగి, సజ్జలను ఆహారంగా తీసుకున్న వారి రక్తంలో గ్లూకోజ్ స్థాయి తక్కువ నమోదైనట్లు జాతీయ పోషకాహార సంస్థ పరిశోధనలో తేలింది. అంతేకాదు, జీర్ణక్రియ మెరుగవడంతో పాటు హిమోగ్లోబిన్ స్థాయిలు పెరిగినట్లు గమనించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం మిల్లెట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలని సిఫార్సు చేసింది.

ఆ బియ్యంతో బిర్యానీ, పులిహోర రుచికరమైన కూరతో అన్నంకలిపి తింటేనే చాలామందికి కడుపు నిండిన భావన. సంకటి, జావలు, రొట్టెలు తినడం ఒకటి రెండు పూటలవరకు ఓకే అంటారు. అంతకుమించి లోనికెళ్లదని చెబుతారు. షుగర్ పెరిగితే మరొక రెండు మాత్రలు ఎక్కువ మింగడానికి సిద్ధపడతారు కానీ వరన్నం మానేయడం లేదా తగ్గించడానికి ససేమిరా అంటారు. అలాంటి వారికోసమే చిరుధాన్యాలతో ఎనలాగ్ బియ్యం తయారు చేశారు ఐఐఎంఆర్ పరిశోధకులు. అది కేవలం చూడడానికే కాదు, వరన్నంలాగే తెల్లగా, కూరతో కలిపి ముద్దగా చేసుకొని తినడానికి అనువుగా, రుచిగా ఉంటుంది.

బిర్యానీ, పులిహోర, పులావ్ లాంటి కమ్మని వంటకాలెన్నో ఎనలాగ్ రైస్‌తో వండుకోవచ్చు. ఎనలాగ్ బియ్యం ఎక్కువ సేపు నానబెట్టనవసరం లేదు. 8 నిమిషాల్లోనే ఉడుకుతుంది. అయితే గంజి వార్చే ప్రక్రియలో వీటిని వండాలి. ప్రస్తుతం రాజేంద్రనగర్‌లోని ఐఐఎంఆర్ ఆహార ఉత్పత్తుల కొనుగోలు కేంద్రంలో మాత్రమే ఎనలాగ్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో మార్కెట్లోకి విడుదల చేస్తామని డైరెక్టర్ తారాసత్యవతి చెప్పారు. ప్రస్తుతం 350గ్రాముల ఎనలాగ్ రైస్‌ను రూ.65కు విక్రయిస్తున్నామని, సరైన మార్కెట్ ధర ఇంకా నిర్ణయించలేదని అధికారులు చెబుతున్నారు.

పిండి నుంచి బియ్యం తయారీ "మిల్లెట్స్‌ను ముందుగా దేనికదే పిండి పట్టిస్తాం. దాన్ని మరొక మిషీన్‌ద్వారా ఎక్స్‌ట్రూషన్‌చేయగా బియ్యం గింజల రూపంలోకి వస్తాయి. వాటిని ఆరబెట్టి ప్యాక్ చేస్తామని" ప్లాంట్ సూపర్‌వైజర్ కార్తీక్ చెప్పారు. చిరుధాన్యాలతో కేకులు, బ్రెడ్, బిస్కెట్లు, కూకీస్, మఫిన్లు, సేమియా, పేలాలు, పాస్తా, న్యూట్రీబార్, కారప్పూస, జంతికలు వంటి రుచికరమైన పదార్థాలు మరెన్నో న్యూట్రీహబ్ లో తయారుచేస్తున్నారు.

సులభంగా జొన్నరొట్టెలు జొన్న, సజ్జలతో మోడిఫైడ్ పిండిని కొద్దిరోజుల్లో అందుబాటులోకి తేనుంది ఐఐఎంఆర్. చపాతీ కర్రతో ఒత్తుతూ మోడిఫైడ్ పిండితో చాలా తేలిగ్గా రొట్టెలు చేయచ్చు. మిల్లెట్ ఇడ్లీ, పొంగల్, సూప్ రెడీమిక్స్‌లు సైతం భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ ప్రాంగణంలో లభ్యమవుతాయి. మిల్లెట్ ఆహార ఉత్పత్తుల ఆధార అంకుర సంస్థలను ప్రోత్సహించడమే లక్ష్యంగా 101వెరైటీల తయారీలో సాంకేతిక సహకారాన్ని తమ సంస్థ అందిస్తోందని స్టాన్లీ తెలిపారు.





# మామిడి పండ్లు తింటే శరీరంలో వేడి పెరుగుతుందా?



మామిడి పండ్లను ఁపండ్లలో రారాజు అని పిలుస్తారు, ఎందుకంటే అవి రుచికరంగా ఉండటమే కాకుండా, విటమిన్లు, ఖనిజాలు వంటి ఎన్నో పోషకాలు మామిడిలో ఉంటాయి. అయితే, మామిడి పండ్లు ఎక్కువగా తింటే శరీరంలో వేడి పెరుగుతుంది అనే మాట చాలా కాలంగా వినిపిస్తోంది. మరి, ఇందులో నిజమెంతో నిపుణులు ఏమంటున్నారో చూద్దాం..

మామిడి పండ్లకు శరీరాన్ని వేడి చేసే స్వభావం కొంతవరకు ఉంటుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కానీ ఇది ప్రతి ఒక్కరిపై ఒకేలా ప్రభావం చూపదు. వ్యక్తి శరీర తత్వం, ఆరోగ్య పరిస్థితిని బట్టి ప్రభావం మారుతుంది. కొంతమందికి మామిడి పండ్లు తిన్న తర్వాత మొటిమలు, నోటి పూతలు లేదా శరీరంలో వేడి పెరిగినట్టు అనిపించవచ్చు. అయితే, మితంగా తింటే సాధారణంగా పెద్దగా సమస్యలు రావు. రోజుకు ఒకటి లేదా రెండు మామిడి పండ్లు తినడం సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

మామిడి పండ్లు ఎక్కువగా తింటే వచ్చే సమస్యలు
శరీరంలో వేడి పెరగడం
మొటిమలు, నోటి పూతలు రావడం
అజీర్ణం, గ్యాస్, విరేచనాలు వంటి సమస్యలు
బరువు పెరగడం
రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం మామిడి పండ్లలో సహజ చక్కెర, కేలరీలు ఎక్కువగా ఉండటంతో, ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు పరిమితంగా తీసుకోవడం మంచిది.
తీసుకోవాల్సిన జాగ్రత్తలు మామిడి పండ్లు మితంగా మాత్రమే తినాలి. ఎక్కువ నీరు తాగాలి. ఖాళీ కడుపుతో ఎక్కువగా తినకూడదు. తిన్న తర్వాత శరీరంలో వేడి పెరిగినట్టు అనిపిస్తే పరిమాణం తగ్గించాలి.

మామిడి పండ్లు మితంగా తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, అతిగా తీసుకుంటే శరీరంలో వేడి పెరగడం సహా కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




ఇటీవల వాతావరణంలో తరచూ మార్పులు జరుగుతున్నాయి. ఒకవైపు ఎండ ఎక్కువగా ఉండగా, మరోవైపు సాయంత్రం చల్లని గాలులు వీస్తున్నాయి. ఈ మార్పులు పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పెద్దలతో పోలిస్తే పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వారు త్వరగా జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలకు గురవుతారు. అందుకే ఈ సమయంలో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా అవసరం.

ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకండి పిల్లలకు తరచూ జ్వరం రావడం, దగ్గు తగ్గకపోవడం వంటి లక్షణాలను తేలికగా తీసుకోకూడదు. అలాగే నీరసం, ఆకలి తగ్గడం, ఎక్కువగా నిద్రపోవడం, చిరాకు పడటం వంటి లక్షణాలు కనిపించినా జాగ్రత్తగా ఉండాలి. కొందరు పిల్లల్లో అలర్జీలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మంపై దద్దుర్లు కూడా రావచ్చు. ఇలాంటి సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యులని సంప్రదించడం మంచిది.


# మెట్రో ఈవినింగ్స్ సినిమా

## ఈ ఇద్దరిలో ఎవరు?



కాక్టెయిల్ 2తో త్వరలో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతున్నారు బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్. ఇప్పుడాయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. బధాయి దో, మైదాన్ లాంటి చిత్రాలతో అలరించిన దర్శకుడు అమిత్ శర్మతో ఓ సినిమా కోసం షాహిద్ చేతులు కలిపారట. ఇందులో కథానాయిక కోసం అందాల తారలు జాన్వీ కపూర్, కియారా అద్వాణీలతో చర్చలు చేస్తున్నట్లు సమాచారం. ఆధునిక బంధాలు, ప్రేక్షకులకు సులభంగా అర్థమయ్యే ప్రేమ ప్రయాణం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉన్న ఈ చిత్రంలో నాయిక పాత్ర కోసం చర్చలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఈ ఏడాది ద్వితీయార్ధంలో సెట్స్పైకి వెళ్లనుందని షాహిద్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి కియార, జాన్వీ.. వీరిద్దరిలో షాహిద్ కలిసి తెరపై సందడి చేసే తార ఎవరో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ప్రస్తుతం జాన్వీ పెద్దితో, కియార టాక్సిక్ సినిమాతో బిజీగా ఉన్నారు.

## విజయ్.. అదే దారిలో!




కథానాయకుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం రణబాలి, రౌడీ జనార్ధన సినిమాలతో సెట్స్పై బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ రెండూ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలుగానే ముస్తాబవుతున్నాయి. అయితే వీటి తర్వాత తన నుంచి రానున్న కొత్త చిత్రంతో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు విజయ్. ఆయన ప్రస్తుతం దర్శకుడు శౌర్యువ్ ఓ గ్లోబల్ చిత్రం చేస్తున్నారు. మైథలాజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్లో రూపొందనున్న ఈ సినిమా.. రెండు సమాంతర ప్రపంచాల్లో సాగే కథగా ఉండనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ చిత్రం కోసం ఓ సరికొత్త వరల్డ్ని సృష్టిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది.



## రామ్ చరణ్ 'పెద్ది'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, తాజాగా మెగాస్టార్ చిరంజీవి సెట్స్ను సందర్శించి చిత్ర బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. తన ఆరాధ్య దైవం, గురువు సెట్కు రావడంతో దర్శకుడు బుచ్చిబాబు సానా సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఈ భారీ చిత్రాన్ని జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చిరంజీవికి సంబంధించిన వీడియో వైరల్ అవుతుండటంతో మెగా అభిమానులు 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.



## అబ్బా అనిపిస్తున్న రకుల్

టాలీవుడ్, బాలీవుడ్లలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె నటిస్తున్న తాజా హిందీ చిత్రం 'పతి పత్నీ ఔర్ ఓ దో' నుంచి తాజాగా 'అంగ' అనే సాంగ్ గ్లింప్స్ విడుదలైంది. ఈ పాటలో రకుల్ తన మునుపెన్నడూ లేని విధంగా అత్యంత బోల్డ్ లుక్లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఈ గ్లింప్స్ను సోషల్ మీడియా వేదికగా పంచుకుంటూ, "హీట్ లెవెల్స్ పెరగనున్నాయి" అంటూ ఆమె ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

## కాలాల్ని దాటి.. లోకాల్ని చుట్టేసి




ప్రేక్షకుల్ని టైమ్ మిషన్ ఎక్కించి.. సరికొత్త ఊహా ప్రపంచాల్లో విహరింపజేసి.. వాళ్లతో అద్భుత అనిపించడంలో దర్శకుడు రాజమౌళిని కొట్టేవాళ్లు లేరు. మగధీర, బాహుబలి లాంటి విజయవంతమైన చిత్రాలతో దాన్నిప్పటికే నిరూపించారు. ఇప్పుడాయన వారణాసి సినిమాతో సినీప్రియుల్ని ఏకంగా యుగాల వెనక్కి తీసుకెళ్లి.. సరికొత్త సినిమాటిక్ అనుభూతిని పంచిచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ బహుభాషా చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. తొలుత ఇది ప్రపంచాన్ని చుట్టేసే సాహసికుడి కథతో రూపొందుతున్నట్లు ప్రచారం జరిగినా.. దీనికి తగ్గట్లే యుగాల వెనక్కి వెళ్లి లంకా నగరాన్ని.. ఆనాటి అపురూప రామ రావణ యుద్ధ ఘట్టాన్ని, దీనితో పాటు నాటి ప్రాచీన వారణాసిని.. ఈ వర్తమాన కలియుగాన్ని వెండితెరపై ఆవిష్కరించనున్నారు జక్కన్న. మరి ఈ కథలో లోకాన్ని రక్షించేందుకు రుద్రగా మహేశ్ చేసిన సాహసాలేంటి.. త్రేతాయుగంలోని శ్రీరాముడికి ఆయనకు ఉన్న సంబంధం ఏంటి? కాల ప్రయాణం చేసి యుగాల వెనక్కి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.




## లావణ్య మెరిసింది..

లీలావతి (లావణ్య త్రిపాఠి) ఓ స్టార్ డైరెక్టర్. చిన్నతనంలో తల్లిదండ్రుల (నరేష్, పవిత్ర) మధ్య చూసిన గొడవల ప్రభావం వల్ల ఆమెకు కొన్ని మానసిక భయాలు ఏర్పడతాయి. ఆ సమస్య నుంచి బయటపడే క్రమంలో రామ్ సేతు (దేవ్ మోహన్) అనే సైకాలజిస్ట్తో పరిచయం ఏర్పడుతుంది. ఆ పరిచయం ప్రేమగా మారి, తండ్రిని ఒప్పించి మరీ అతన్ని పెళ్లి చేసుకుంటుంది. అంతా సాఫీగా సాగుతుందనుకున్న మూడేళ్ల తర్వాత, రామ్ సేతు తనకు విడాకులు కావాలని అడుగుతాడు. తాను నర్సు నికోలా సెబాస్టియన్ (మడోనా సెబాస్టియన్)తో ప్రేమలో ఉన్నానని, విడాకులు ఇస్తే ఆమెతో కొత్త జీవితం మొదలుపెడతానని చెబుతాడు. ఆ మాటలతో కోపంతో రగిలిపోయిన లీలావతి అతన్ని చితకబాది ఇంట్లోనే బంధిస్తుంది. ఆ తర్వాత వారి బంధం ఏ మలుపు తిరిగింది, మధ్యలో వచ్చిన ఇతర పాత్రల నేపథ్యం ఏంటి, చివరకు వారు విడిపోయారా లేదా కలిశారా అనేది మిగతా కథ.

## బాలయ్యతో బాలీవుడ్ బ్యూటీ




నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనిల క్రేజీ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చీదీఖ111 చిత్రంపై అంచనాలు పెరుగుతున్నాయి. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరూ మళ్లీ జతకట్టడంతో అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఒక అదిరిపోయే అప్డేట్ ఫ్యాన్స్లో జోష్ నింపుతోంది. ఈ చిత్రంలోని ఒక స్పెషల్ సాంగ్ కోసం బాలీవుడ్ భామ నర్గీస్ ఫక్రీని ఎంపిక చేసినట్లు సమాచారం.



## మహాభారత కాలం కలి యుగాంతం!



మహాభారత కురుక్షేత్ర మహా సంగ్రామాన్ని.. కలి యుగాంతాన్ని ముడిపెట్టి దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందించిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ సినిమా కల్కి 2898ఏడీ. ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్హాసన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమా.. 2024లో విడుదలై, భారీ విజయాన్ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్ర సీక్వెల్ సినీప్రియుల్ని మరోసారి కాల ప్రయాణం చేయించేందుకు సిద్ధమవుతున్నారు ప్రభాస్. ప్రస్తుతం ఈ రెండో భాగం చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. తొలి భాగంలో కథంతా ప్రధానంగా ప్రభాస్ చేసిన భైరవ, అమితాబ్ పోషించిన అశ్వత్థామ పాత్రల చుట్టూనే తిరగ్గా.. ఈ సీక్వెల్ మాత్రం కురుక్షేత్ర మహాసంగ్రామాన్ని.. దీనికి భవిష్యత్ కాశీ, శంబాల, కాంప్లెక్స్ ప్రపంచాలకు మధ్య ఉన్న కనెక్షన్ని మరింత లోతుగా స్పృశించనున్నట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా ప్రభాస్ పోషించిన కర్ణుడి పాత్రకు దీంట్లో ఎంతో ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. మరి ఈసారి ఈ కల్కి.. సీక్వెల్ బాక్సాఫీస్ ముందు ఎలాంటి సంచలనాల్ని సృష్టిస్తుందో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

## హంగ్రీ చీతా ఆగయా




టాలీవుడ్లో ఇప్పుడు మరోసారి ఓజీ 2 గురించి భారీ చర్చ మొదలైంది. డైరెక్టర్ సుజీత్ ప్రస్తుతం ఓజీ సీక్వెల్పై పూర్తిగా ఫోకస్ పెట్టినట్టు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వచ్చిన ఓజీ భారీ విజయాన్ని అందుకున్న తర్వాత నుంచే రెండో భాగంపై అభిమానుల్లో అంచనాలు పెరిగిపోయాయి.

ఓజీ సినిమా పవన్ కళ్యాణ్ కెరీర్లోనే స్టైలిష్ యాక్షన్ బ్లాక్బస్టర్గా నిలిచింది. సుజీత్ తెరకెక్కించిన యాక్షన్ సన్నివేశాలు, పవన్ పాత్ర డిజైన్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ను చూపించిన తీరు అభిమానులకు ఫుల్ కిక్ ఇచ్చింది.

ఓజీ తర్వాత హీరో నానితో బ్లడీ రోమియో సినిమా చేయాలని సుజీత్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. అయితే డేట్స్ సమస్యలు, నిర్మాణ కారణాలతో ఆ సినిమా ఆలస్యమైందని సమాచారం. అలాగే నాని ప్రస్తుతం చేస్తున్న మరో సినిమా కారణంగా కూడా ఈ ప్రాజెక్ట్ ముందుకు వెళ్లలేదని టాలీవుడ్లో ప్రచారం జరుగుతోంది.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007